mohan PUBLICATIONS
Granthanidhi.blogspot.in
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533 101.
Mohanpublications.com
SUNDAY SPECIAL MAGAZINES
గ్రంథనిధి

వార్త
ఆదివారం
16 జూలై 2017

నీటి పంటలు హైడ్రోపోనిక్స్!

తారాతీరం

అభిమానుల్ని తలెత్తుకునేలా చేస్తా

మెగాహీరో వరుణ్‌తేజ్ చిత్రం 'ఫిదా' ఆడియో వేడుకలో హీరో వరుణ్ తన స్పీచ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. ఫ్యాన్స్ నుండి ఇలాంటి సినిమాలు చేయండి... అలాంటి సినిమాలు చేయండి... అంటూ సజెషన్స్ వస్తుంటాయని.. తాను కూడ అదే ధోరణిలో ట్రై చేస్తున్నానని తెలిపాడు. ఇంతకుముందు కొన్ని తప్పటడుగులు వేసినా, ఇకపై మంచి సినిమాలే చేస్తానని, అభిమానులు తలెత్తుకునేలా చేస్తానని ప్రకటించాడు.. ఆయన మాటలకు వచ్చిన అభిమానుల్లో కోలాహలం నెలకొంది..

పొలిటీషియన్‌గా..

బాహుబలిలో శివగామిగా నటించిన సీనియర్ నటి రమ్యకృష్ణ పొలిటీషియన్‌గా అదరగొట్టబోతోంది.. నారా రోహిత్ హీరోగా పవన్ మల్లెల డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న న్యూ మూవీలో పవర్‌ఫుల్ పొలిటీషియన్‌గా కన్పించనుందట.. రమ్య, నారా రోహిత్‌ల మధ్య వచ్చే సీన్లు, డైలాగులు సినిమాకే హైలెట్ అవుతాయని యూనిట్‌మాట.

నిండా పంచ్ డైలాగ్స్

నందమూరి బాలకృష్ణ , పూరి జగన్నాథ్‌ల క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'పైసా వసూల్'. బాలయ్య తన రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా పూర్తి స్థాయి కమర్షియల్ ఫార్మాట్‌లో చేస్తున్న చిత్రమిది. బాలయ్య నుంచి ఫ్యాన్స్ ఎక్కువగా ఇష్టపడే పంచ్ డైలాగులు కూడ ఈ సినిమాలో ఎక్కువగా ఉన్నాయట. ఎలాంటి డైలాగునైనా అలవోకగా చెప్పగలిగే బాలయ్యకు పూరి రాసిన పవర్‌ఫుల్ పంచ్ డైలాగులు చాలా బాగా కుదిరాయని, థియేటర్లలో అభిమానులకు పండగేనని అంటున్నారు. డైలాగులు ఎలా ఉంటాయో తెలుసుకోవాలంటే సెప్టెంబర్ 29దాకా వెయిట్ చేయాల్సిందే.

ఇ-పేపర్‌కోసం vaartha.com క్లిక్ చేయండి

యంగ్‌టైగర్ కూడా ఫేవరేట్

ఎవరితో కలిసి నటిస్తే వాళ్లకి అభిమానిగా మారిపోతున్నట్టుంది నివేదా థామస్.. ఈమె 'దృశ్యం' తమిళ రీమేక్ 'పాపనాశం'లో కమల్‌హాసన్‌తో నటించింది.. అప్పట్నుంచి కమల్‌హాసన్ నా ఫేవరేట్.. అంటూ చెప్పుకొచ్చింది.. ఆ తర్వాత నానితో కలిసి 'జెంటిల్మెన్' చేసింది.. ఆ సినిమా చేసేటపుడే నాని నా ఫేవరేట్ హీరో అని చెప్పింది.. తన ఫేవరేట్ హీరోతో కలిసి ఇటీవల రెండో సినిమా 'నిన్నుకోరి'లో నటించింది.ఆ చిత్రం ఘనవిజయం సాధించింది. ఈ సందర్భంగా సోషల్‌నెట్ వర్కింగ్‌లో మాటామంతీ జరుపుకుంది.ఈ సందర్భంగా ఆమె మరోసారి ఆసక్తికరమైన విషయం చెప్పింది. ఎన్టీఆర్ నాకు మరో ఫేవరేట్ అని చెప్పుకొచ్చింది. 'జై లవకుశ'లో ఎన్టీఆర్ సరసన నటిస్తోంది.అయితే ఈ సినిమాకు సంబంధించిన విషయాల్ని మాత్రం అస్సలు బయట పెట్టలేదీ అమ్మడు. ఈమె ఫేవరేట్ హీరోల జాబితా ఎన్టీఆర్‌తో ఆగిపోతుందా? లేక మళ్లీ ఎవరితోనైనా కలిసి నటించాక వాళ్లు కూడ తన ఫేవరేట్ హీరోలే అని చెబుతుందేమో వేచిచూడాలి!

కె.లీలా సువర్ణ



An ISO 9001 - 2000 Certified ®
The art of healing
పాజిటివ్ హోమియోపతి
www.drpositive.in
PCOD,
థైరాయిడ్ సమస్యలు
సంతానలేమిగా
మారవచ్చు!
పరిష్కారం కొరకు
మా డాక్టర్‌తో మాట్లాడండి :
903 056 1155
ఫిమేల్ ఇన్‌ఫెర్టిలిటి
నెలసరి సమస్యలు
విపరీతమైన కడుపునొప్పి
అబార్షన్స్
అధిక స్రావం
మేల్ ఇన్‌ఫెర్టిలిటి
అజోస్పెర్మియా
అలిగోస్పెర్మియా
అంగస్తంభన సమస్యలు
శీఘ్రస్కలన సమస్యలు
PCOD
ట్యూబ్స్ బ్లాకెజ్
హార్మోన్ సమస్యలు
వొవెరిన్ సమస్యలు
చాక్లెట్ సిస్ట్
థైరాయిడ్
హైపర్, హైపో థైరాయిడ్
గాయిటర్
బరువు పెరగడం
పిల్లలు పుట్టకపోవడం
ఇతర చికిత్సలు
సోరియాసిస్ డయాబెటిస్ పైల్స్ అస్తమా అలర్జీ లైంగిక సమస్యలు
ఆటిజం కిడ్నీలో రాళ్ళు కీళ్ళ నొప్పులు హెపటైటిస్ బి
మరింత సమాచారం కొరకు టోల్ ఫ్రీ : 1800 108 1900
బేగంపేట | అమీర్‌పేట | జూబ్లిహిల్స్ | కొండాపూర్ | కూకట్‌పల్లి | విక్రమ్‌పురి | A.S.రావు నగర్
కాచిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | మెహిదీపట్నం | నిజామాబాద్ | హన్మకొండ | కరీంనగర్ | ఖమ్మం | తమిళనాడు

ఆదివారం వార్త

16 జూలై 2017

విషయ విశేషం

'సంఘీ'భావం
కఠిన శిక్షలతోనే కల్తీకి కళ్లెం!... 5
మూడో కన్ను
'జంక్షన్'లో జగడం!...6
కవర్‌స్టోరీ
నీటి పంటలు
హైడ్రోపోనిక్స్!...8
కవిత్వంతో కరచాలనం చేయడమంటే..12
ప్రేమ కథామాలిక
రక్తి వీడి, ముక్తి కోరి...14
కథ
గడి విప్పని పట్టుచీర.....20
ఈవారం కవిత్వం
మౌనఛాయ....23
చిత్రభారతి
బహుముఖ ప్రజ్ఞాశాలికి
బంగారు నీరాజనం....30
ఇంకా..కృతి, మొగ్గ, నవ్వుల్.. రువ్వుల్,
వాస్తు వార్త, పదమథనం ..వారఫలం..
వగైరా... వగైరా.

మంచి ముత్యాలు

దేశానికిగాని, సమాజానికిగాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ఉన్నప్పుడే జాతి బాగుపడుతుంది.

-డా.బి.ఆర్. అంబేద్కర్

భావ వీచిక

ఇదెక్కడి మూర్ఖత్వం!

స్వచ్ఛ భారత్ అంటూ ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపుకు ప్రజలంతా ప్రతిస్పందించి అనేక కార్యక్రమాలు చేపడుతుంటే ఇంకా కొన్ని చోట్ల మాత్రం ఆ ఛాయలు లేశ మాత్రం కనపడటంలేదు. ఎన్నో అపోహలు, ఎన్నో మూఢనమ్మకాలు ప్రజలను ఇంకా అంటిపెట్టుకునే ఉన్నాయి. అందుకు ఓ ఉదాహరణ బీహార్‌లోని ఘాజీపూర్ గ్రామం. ఆ గ్రామంలో కనీసం ఒక్క మరుగుదొడ్డి కూడా లేదు. అందుకు కారణం మరుగుదొడ్డి వారికి దురదృష్టం తెచ్చిపెట్టేదిగా వారు భావించటమే. నేపథ్యం చూస్తే...1994లో ఘజీపూర్‌లో సిద్ధేశ్వర్ సింగ్ అనే ఓ రైతు తమ ఇంట్లో ఓ మరుగుదొడ్డి నిర్మాణం ఆరంభించారు. ఆ సమయంలోనే ఆయన కుమారుడికి ఏదో వ్యాధి వచ్చి కన్నుమూయడం జరిగింది. ఆ తర్వాత 1996లో గ్రామంలోని మరొకరికి కూడా ఇదే అనుభవం ఎదురైంది. దాంతో మరుగుదొడ్డి తమకు అచ్చిరాదని, అది దురదృష్టాన్ని, మరణాన్ని తెస్తుందని ఆ ఊరి వారు నమ్మటం మొదలుపెట్టారు. యాదృచ్ఛికంగా జరిగే ఘటనలను ఒకదానితో ఒకటి లింక్ కలిపి ఆలోచించటం ఎంత అర్థ రహితం? ఆరోగ్యకరమైన జీవనానికి, శుభ్రతకు తప్పనిసరి అయిన మరుగుదొడ్డి సౌకర్యాన్ని మూర్ఖత్వంతో శాశ్వతంగా మానుకున్నారు ఆ గ్రామం వారు. మరి ఆ ఊళ్లోని విద్యావంతులు ఏం చేస్తున్నట్టు? ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేయకపోతే ఎలా? కనీసం విద్యావంతులైనా వారింట మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టి, దానివల్ల ఆరోగ్యమే కానీ ఎటువంటి దురదృష్టం ఉండదని తెలియజెప్పగలిగితే ఎంత బాగుండు! ఘాజీపూర్ విషయం ఒక్కటే వెలుగులోకి వచ్చింది కానీ మనదేశంలో మరుగుదొడ్డి అసలే లేని గ్రామాలు మరెన్నో ఉండే ఉంటాయి. విద్యావంతులు గ్రామీణ ప్రజలను ఈ విషయమై చైతన్యపరచటానికి ముమ్మరంగా కృషిచేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. తిమిరంలో ఉంటూ, తిరోగమనంలో సాగుతూ ఉంటే అభివృద్ధి వెలుగుల సాధన ఎలా సాధ్యమవుతుంది? అందుకే మంచిదైన మార్పుకోసం ప్రతివారు నిరంతర ప్రయత్నం చేస్తూనే ఉండాలి.

లేఖలు

సరికొత్త దృక్కోణం..

జూలై 2 వార్త ఆదివారం అనుబంధంలో 'వెండితెరపె 'చదువు'చిత్రం..నేర్చిందెంత! నేర్పేదెంత!' కవర్‌స్టోరీ అంశం సరికొత్తగా ఉంది. తెలుగు చిత్రాలలో విద్యారంగాన్ని చూపిన తీరును చక్కగా విశ్లేషించారు. మంచి, చెడులను రెండిటినీ పేర్కొనడం ముదావహం. మున్ముందు ఆదర్శవంతంగా ఉండేలా చిత్రాల్లో చదువును చిత్రీకరిస్తారని ఆశిద్దాం.

-కె.రాఘవరావ్, హైదరాబాద్; డి. నాగరాజు, నల్గొండ; కె.సత్యసాయి, విజయవాడ.

కథ కదిలించింది..

జూలై 2 వార్త ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'మూగవేదన' కథ బాగుంది. నోరులేని మూగజీవాలే అయినా వాటికీ ఉచితానుచితాలు తెలుస్తాయని చక్కగా చెప్పారు. గొడ్ల హనుమంతు, కల్యాణి చివరలో శత్రుసంహారం చేసి, ధర్నాచౌక్‌కు చేరుకోవడం, తమకూ వృద్ధాశ్రమాలు కావాలన్న బోర్డు తగిలించుకోవడం చాలా బాగుంది. కథా రచయితకు మా అభినందనలు.

- జి.రేఖ, హైదరాబాద్; సి.పవన్, గుంటూరు.

చక్కని సంచిక

వార్త ఆదివారం మేగజైన్ జూలై 2 సంచికలో జాగ్రత్తలోనే భద్రత అంటూ జూనోసిస్ గురించి 'భావవీచిక'లో మేలైన సంగతులు చెప్పారు. 'సంఘీ'భావంలో అక్రమ అద్దె గర్భాల బాగోతాన్ని చక్కగా చర్చించారు. సినిమాల్లో చదువుల గురించిన కవర్‌స్టోరీ విశ్లేషణాత్మకంగా, ఆలోచింపజేసేలా రూపుదిద్దుకొంది. 'మూగవేదన' కథా రచయితకు మా అభినందనలు. 'అడ్డుగోడలు' కవిత బాగుంది. బ్యాక్‌పేజీ పైని 'అస్తమయ వేళ సౌందర్య శోభ' మమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది.

-నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం.

ఆకట్టుకున్న ఆర్టికల్స్..

జూలై 2 వార్త ఆదివారం మేగజైన్‌లో కవర్‌స్టోరీలో చలనచిత్రాలలో విద్య, విద్యాలయాలను చిత్రీకరించిన తీరును, మంచి చెడులను వివరించిన తీరు మెచ్చదగ్గదిగా ఉంది. కవిత్వాన్ని ఎందుకు కళ్లకద్దుకోవాలో భల్లం చక్కగా వివరించారు. జీవితంలో ఏఏ పరిస్థితులు అడ్డుగోడలుగా నిలుస్తున్నాయో బ్రహ్మాజీరావు తమ కవితలో వేదనా పూర్వకంగా చెప్పిన తీరు ఎంతైనా ప్రశంసనీయం. 'పల్లె-పట్నం' కథ చిన్నదైనా బాగా కుదిరింది. నోరులేని జీవుల యాతనకు 'మూగవేదన' కథ నిజ దర్పణంలా ఉంది. 'సంఘీ'భావం'లో సమకాలీన సమస్య..అక్రమ అద్దెగర్భాల అన్ని కోణాలనూ చక్కగా ఆవిష్కరించారు.

-డా.శివ భూషణం, కర్నూలు.

'సంఘీ'భావం

కఠిన శిక్షలతోనే కల్తీకి కళ్లెం!

"కాదేదీ కవితకనర్హం" అని ఓ కవి అంటే కల్తీరాయుళ్లు దాన్ని "కల్తీకి అన్నీ అర్హమే" అంటూ నిర్వచనాన్నే మార్చి మానవ మనుగడకే సవాలు విసురుతున్నారు.

హైదరాబాద్‌లో తాగే పాల నుంచి వాడే నూనె, తినే బియ్యం, గోధుమ పిండి.. మొదలుకుని దైనందిన జీవనంలో వినియోగించే అన్ని పదార్థాలను కల్తీరాయుళ్లు యధేచ్ఛగా కల్తీ చేస్తున్నారు. అసలు సరకుల కంటే నకిలీ సరకుల అమ్మకంతో పది రెట్ల లాభం కళ్లజూడటంతో కల్తీరాయుళ్లు విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. కానీ తమ కల్తీతో మనిషి జీవితమే వ్యాధులతో అల్లకల్లోలం అవుతుందని ఊహించడం లేదు. తమకు కావలసింది డబ్బే తప్ప మనిషి జీవితం కాదని భావించడం వల్లే కల్తీరాయుళ్ల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. మనిషి ప్రాణాలకు అసలు విలువే లేదన్నట్లుగా కల్తీ వ్యాపారాల బండారం రోజుకో రకంగా బయట పడుతున్నది. చివరకు అల్లం, వెల్లుల్లి, మెంతులు, ఆవాలు, మిరియాలు, బిస్కెట్లను కృత్రిమ పదార్థాలు, కెమికల్స్‌తో కల్తీ చేసి మార్కెట్ చేస్తున్నారు. కోట్లు గడిస్తూ ఆ డబ్బుతో ఆహార కల్తీని నిరోధించే వ్యవస్థను అవినీతితో భ్రష్టు పట్టిస్తున్నారు. దశాబ్దాలుగా సకల వస్తువుల కల్తీ అనేది వ్యాపారం నుంచి మహా పరిశ్రమగా ఎదిగింది. హైదరాబాద్ శివార్లు ముఖ్యంగా కాటెదాన్ లాంటి ప్రాంతాలు కల్తీ తయారీకి కేరాఫ్‌గా మారాయి. మానవాళికి అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన నిషేధించిన ప్లాస్టిక్‌ను కూడా ఇక్కడే తయారు చేస్తున్నారు.

శివారు ప్రాంతాలు కల్తీ గుట్కాకు కూడా కేంద్రంగా మారాయి. అయినా ఇప్పటివరకు అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి కేసులు పెట్టారు. కానీ ఆ కేసుల్లో కల్తీరాయుళ్లకు కఠిన శిక్షలు పడలేదు. చివరకు వారు కనీసం జైలుకు కూడా వెళ్లడం లేదు. దీంతో అక్రమ అవినీతి అధికారులు కల్తీరాయుళ్లు కుమ్మక్కై కల్తీ వ్యాపారాన్ని పరిశ్రమగా విస్తరించినట్లుగా ఇటీవల జరిగిన దాడులు నిరూపిస్తున్నాయి. మనుషుల మనుగడకే కాకుండా పంటలను దెబ్బ తీసే నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు కూడా మార్కెట్‌లో వీరవిహారం చేస్తున్నాయి.

రైతులు ఆరుగాలం చెమటోడ్చి రక్తం చిందించి పండించే పంటలకు మూలం విత్తనం, ఎరువు. దీనికోసం రైతులు తల తాకట్టు పెట్టి అప్పులు చేసి ఎరువులు, విత్తనాలు కొంటున్నారు. కానీ ఆ ఎరువులు విత్తనాలను కల్తీ చేసి రైతులకు మాయ బ్రాండ్లతో ముంచేసే కల్తీ విత్తన ముఠాలు కూడా ఇటీవల పెద్ద ఎత్తున బయట పడ్డాయి. దీనికితోడు వారాంతంలో భిన్న రుచులకోసం హోటళ్లకు, రెస్టారెంట్లకు వెళ్తే అక్కడ మాంసం, చికెన్ నుంచి అన్నీ అపరిశుభ్ర వాతావరణంలో కల్తీవి వండి వారుస్తున్నారు. ఇవి తిన్న ప్రజలు వాంతులు, విరోచనాలతో తక్షణం ఆస్పత్రులకు వెళ్తుంటే దీర్ఘకాలంలో క్యాన్సర్, గుండె, మూత్రపిండ వ్యాధుల బారిన పడి చికిత్సలకోసం లక్షలు ఖర్చు చేయాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది.

తెలుగు రాష్ట్రాల్లో కల్తీ మహమ్మారి ఇప్పటిది కాదు. అన్ని ప్రభుత్వాల పాలనలోను ఇంతింతై వటుడింతై అన్నట్లుగా విరాజిల్లుతూ ఇప్పటికి విశ్వరూపాన్ని కూడా దాటిపోవడంతో ఇప్పటి తెలుగు ప్రభుత్వాలు కల్తీని సీరియస్‌గా తీసుకున్నాయి. ముఖ్యంగా తెలంగాణా ప్రభుత్వం అన్ని రకాల కల్తీని నిరోధించడానికి కఠిన చట్టాలను తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నది. విత్తనాలు, ఆహారం, చివరకు పాలు కూడా యూరియాతో కల్తీ కావడం ప్రభుత్వాన్ని విభ్రాంతికి గురి చేసింది. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం కల్తీ నిరోధ చట్టాలను, వాటి అమలును, వాటి లోపాలను కనుగొనే సమగ్ర సమీక్షకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. అన్ని రకాల కల్తీలను నిరోధించేందుకు చట్టాలు ఎన్నో ఉన్నాయి. వాటికనుగుణంగా కల్తీ నిరోధక యంత్రాంగాలు కూడా ఉన్నాయి. కానీ లేనిదల్లా వాటి అమలే. దీనికితోడు అమలు వ్యవస్థ సరిగ్గా లేకపోవడం కూడా కల్తీరాయుళ్ల పంట పండిస్తున్నది.

హైదరాబాద్‌నే ఉదాహరణగా తీసుకుంటే వేలాదిగా హోటళ్లున్నా నలుగురైదుగురు కన్నా ఎక్కువగా ఆహార కల్తీ ఇన్‌స్పెక్టర్లు లేరంటే ఈ వ్యవస్థ ఎంత అవ్యవస్థలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయ శాఖలో కూడా మండల స్థాయిలో నకిలీ విత్తనాలను, ఎరువులను, పురుగు మందులను నిరోధించేందుకు వ్యవసాయ అధికారులు ఉన్నా వారు నామమాత్రంగా జీతాలకోసం ఉన్నట్టుగా పని చేస్తున్నారు తప్ప వాటి నిరోధానికి కఠిన తనిఖీలు, చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ప్రతి వ్యవసాయ సీజన్‌లో కల్తీ అనేది ఒక జాడ్యంగా మారింది.

ఇప్పటివరకు కల్తీలో కేసులు వేలాదిగా నమోదయినా శిక్షలు మాత్రం నామమాత్రమే. అసలు కల్తీని గుర్తించే పరికరాలు, ప్రయోగశాలలే లేవు. అలాంటప్పుడు కల్తీని ఎలా నిరోధిస్తారన్నది సామాన్యుని నుంచి వినవచ్చే ప్రశ్న. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్తీపై కఠిన చట్టాలే కాకుండా అమలు యంత్రాంగాన్ని విస్తృతంగా నియమించాలి. అలాగే నామమాత్రపు కేసులు కాకుండా నాన్ బెయిలబుల్ కేసులను పెట్టే విధంగా చట్టాలను మార్చాలి. కోర్టుముందు కల్తీని రుజువు చేసే విధంగా కల్తీ పరీక్షల ప్రయోగశాలలను ఆధునీకరించాలి. వీటికి అవసరమయిన నిపుణులను యుద్ధ ప్రాతిపదికన నియమించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వమే కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు కూడా ఆహార, విత్తన కల్తీ జరక్కుండా చట్టాలకు మరింత పదును పెడుతున్నాయి. నిందితులను గుర్తిస్తే వెంటనే జైలుకు పంపించే సెక్షన్‌లను కూడా అమలు చేస్తున్నారు.

కల్తీ చేస్తే శిక్ష తీవ్రంగా ఉంటుందనే భయం వస్తే తప్ప దేశంలో కల్తీని అరికట్టడం అసాధ్యమని సామాజిక శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మార్కెట్‌లోకి వెళ్లి ఏది కొనాలన్నా, ఏది తినాలన్నా, ఏది తీసుకోవాలన్నా, ఏది అసలో, ఏది నకిలీయో తెలియని పరిస్థితి అంతటా దాపురించింది. కల్తీనే ప్రజల ప్రాణాలను హరించివేస్తుండటం భయాందోళనకర పరిణామంగా మారింది. పాలకులు ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా కల్తీని నివారించటానికి మొత్తం చట్టాలను, అమలును ప్రక్షాళించాలి. కల్తీకి శిక్ష తప్పదనే సందేశం వెళ్తే తప్ప కల్తీ జాడ్యం తొలగే పరిస్థితి కనిపించడం లేదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మూడో కన్ను

'జంక్షన్'లో జగడం!

– ఎ.వి.వి. ప్రసాద్

మూడు దేశాల కూడలి అయిన డొక్లామ్ ట్రై జంక్షన్ వద్ద చెలరేగిన జగడాన్ని అడ్డు పెట్టుకొని ఏదో సాధించాలనుకోవడం చైనా భ్రమ మాత్రమే అని ఆ దేశం గ్రహించవలసి ఉంది. చైనా తన సైనికావసరాలకోసం డొక్లామ్ ప్రాంతం మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టడం పూర్తిగా అక్రమం. భూటాన్‌కు చైనాతో ఎలాంటి దౌత్య సంబంధాలు లేకపోవడంతో అక్కడ జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనడానికి భారత్ సాయం అర్థించింది. ఆ దేశానికి దౌత్య, సైనికపరమైన మద్దతు ఇచ్చే బాధ్యత భారత్‌కు ఎప్పటినుంచో ఉంది. అందుకే భారత్ ముందుకు వస్తుంది గనుక- రాగానే దాడికి దిగుదామని చైనా కాచుకొని ఉంది. డొక్లామ్ వద్ద ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం అదే. భారత్ సైనికులు ఆ ప్రాంతంలో మొహరించారంటే అది వారి బాధ్యత. కానీ చైనా అక్కడ రోడ్డు నిర్మించడం అక్రమ చర్య. ఇది భౌగోళికంగా కనిపించే యదార్థం. చైనా దానినే ఉల్లంఘిస్తోంది....

సిగ్గు శరము లేదు చీనాలకిసుమంత
కదులుచుండె గిల్లి కయ్యమునకు;
చాలునింక వ్యర్థ సరిహద్దు తగవులు
విశ్వవినుత నామ! వినురవేమ!!

చైనా మళ్లీ చిందులేస్తోంది..సరిహద్దుల వద్ద డ్రాగన్ విషం చిమ్ముతోంది. కారణం–కడుపుమంట. హద్దులు మీరుతున్న ఆక్రమణవాదం, సూపర్‌పవర్ తాను తప్ప మరొకరు కాకూడదనే దురహంకారం..కమ్యూనిస్టు పాలకుల చేత తప్పుమీద తప్పులు చేయిస్తున్నాయి. ఎప్పుడో శాంతించిన విషయాలను తవ్వితీసి, ఎప్పుడో ఉపశమించిన గాయాలపై మళ్లీ గాట్లుపెట్టి ఒక పాశవిక ఆనందాన్ని అనుభవిస్తున్నదంటే చైనా దుర్బుద్ధి ఎంత పరాకాష్టకు చేరిందో చెప్పడానికి అంతకుమించిన ఉదాహరణ ఏం ఉంటుంది! ఆగ్నేయాసియా, దక్షిణాసియా,, మధ్య ఆసియాకు చెందిన పలుదేశాలతో చైనా సరిహద్దు ఉండడంతో ఆ దేశాలన్నిటిని తన గుప్పెటలో ఉంచుకొని, పొరుగున 'సూపర్ పవర్'గా ఎదుగుతున్న భారత్‌ను ఏదో విధంగా అణచివేయాలనే దురుద్దేశంతో చైనా ముందుకు కదులుతోంది. పైపెచ్చు భారత్‌కు ప్రపంచ దేశాల మధ్య ప్రతి సంవత్సరం 'స్థాయి' పెరుగుతూ అన్ని విషయాలలోను చైనాకు దీటుగా, పోటీగా ఎదుగుతూండడంతో డ్రాగన్‌కు నిద్రపట్టని పరిస్థితి ఏర్పడుతోంది. 'ట్రై జంక్షన్' వద్ద తాజా జగడానికి అదే ప్రధాన కారణం. డొక్లామ్ వద్ద సైనిక ప్రతిష్టంభన ఏర్పడడానికి, ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరడానికి అదే కారణం. నిష్కారణంగా భారత్‌ను రెచ్చగొడుతూ, గిల్లికజ్జాలు పెట్టుకొని ప్రపంచంలో ప్రస్తుతం ఇంతకంటె భయంకర సమస్య ఏదీలేదనే భయానక పరిస్థితిని సృష్టిస్తోంది. అనవసరంగా భూటాన్‌ను తెరపైకి తెచ్చి ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో విషవాయువులను చిమ్ముతోంది.

సాధారణంగా ఏ తగవుల మారి అయినా ఏంచేస్తాడు! అవతలి వ్యక్తి ప్రశాంతంగా ఉంటే చూడలేక తనకుతానుగా అతడిని కొట్టి యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తాడు. జిడిపిలోనో, ఇతర అభివృద్ధి సూచికల్లోనో భారత్ అభివృద్ధిని చూడలేక, ఇక వేరే దారిలేక ఇప్పుడు చైనా చేస్తున్నది కూడా అదే. దక్షిణ చైనా సముద్రంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడుతున్నదో, ఇరుగుపొరుగు దేశాల సరిహద్దుల వద్ద కూడా చైనా అవే అక్రమాలకు పాల్పడుతోంది. కమ్యూనిస్టులంటే ఆక్రమణవాదులనే కొత్త భాష్యం ప్రపంచానికి చెబుతోంది. 'ఎవరు గొప్ప' అనే దిశలో వ్యాఖ్యలు వినిపించడం, ఆ క్రమంలో ఒకరినొకరు మరింతగా రెచ్చగొట్టుకొనడం చూస్తే మరి కాస్సేపట్లో ఇరుదేశాల మధ్య ఏ క్షిపణి పోరో ప్రారంభమవుతుందేమో! అనే సందేహం కూడా కలుగుతుంది. వాతావరణం అంతలా మరుగుతోంది మరి. కానీ ఏమీ జరగకపోవచ్చు. యుద్ధమంటే మాటలు కాదనీ, ఏవో రెండు తుపాకులు పేల్చడం కాదనీ, ఉభయులకూ తెలుసు. ప్రస్తుత పరిస్థితిలో ఎక్కడైనా యుద్ధమంటూ జరిగితే కొన్ని గంటల్లోనే లెక్కలేనన్ని దేశాలు బూడిద కుప్పలుగా మారిపోతాయి. అగ్రరాజ్యాలకే కాదు, ఇతర అన్ని దేశాలకు కూడా ఈ విషయం తెలుసు. మరి చైనా, భారత్ వంటి రెండు కొదమ సింహాలు ఢీకొంటే! పరిణామాలు ఊహకైనా అందవు. అందుకే నియంత్రణ అవసరం..సంయమనం అవసరం. తగవులుంటే పరిష్కరించుకోవడానికి దౌత్య పద్ధతులున్నాయి. అలాంటి ఒడంబడికలున్నాయి. కానీ వాటన్నిటిని కాదని చైనా సైనికులు అలా భూటాన్ భూభాగంలోకి, లేక నేరుగా భారత్ భూభాగంలోకి వచ్చేసి తగవులు అధికం చేస్తున్నారంటే ఏమనుకోవాలి! చైనా అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తున్నట్లేకదా!

ఈ మధ్య టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ మోనాస్టరీని సందర్శించినపుడు చైనా ఇలాగే విరుచుకుపడింది. ఆ ప్రాంతం చైనాది కాదు. కానీ దానికోసం అక్రమంగా ఘోష పెడుతోంది. అరుణాచల్‌లోని సరిహద్దు ప్రాంతాలు కొన్ని తనవేనని ఒకసారి, కాదు ఆ రాష్ట్రం మొత్తం తనదేనని మరోసారి చైనా భారత్‌పై విరుచుకుపడుతూ చిచ్చు పెడుతున్నదంటే అంతకుమించిన ఆక్రమణవాది ప్రపంచంలో మరొకటి ఉందని చెప్పగలమా! అదే తరహాలో ఇప్పుడు సిక్కింలో చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తోంది. నాటి ఒప్పందాలకు వక్రభాష్యం చెబుతూ తన వంకర బుద్ధిని బయట పెట్టింది. సిక్కింలో పరోక్షంగా స్వాతంత్ర్య కాంక్షను ఎగదోస్తున్న చైనా అక్కడ జరుగుతున్న ఉద్యమాలకు తన మద్దతు ప్రకటిస్తానన్నదంటే అంతకంటె ధిక్కారం ఏముంటుంది! సిక్కిం భారత్‌లో భాగమా, కాదా అనే విషయాన్ని చైనా ఇప్పుడు పరిశీలిస్తున్నదట! తైవాన్ విషయంలో తప్పటడుగులు వేసిన చైనా భారత్ భూభాగాల గురించి ఆలోచిస్తున్నదంటే అంతర్జాతీయ న్యాయస్థానం దానికి ఏ శిక్ష వేయాలి? కానీ భద్రతామండలి శాశ్వత సభ్య దేశాలలో ఒకటిగా, వీటో అధికారం ఉన్న దేశంగా సందర్భం వచ్చినప్పుడల్లా భారత్‌పై చైనా ఇలా రెచ్చిపోతోంది. సిక్కింలో వేలు పెడుతున్నదంటే దాని వెనుకగల దురంహంకారం వల్లనే.

ఇరుగు పొరుగు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనడం కోసం భారత్, చైనా, మయన్మార్ మధ్య కొన్ని దశాబ్దాల క్రితమే 'పంచశీల' ఆవిష్కృతమైంది. ఆ సూత్రాల ప్రకారం నడచుకోవాలని అప్పట్లో అంగీకారం కుదిరింది. కానీ తర్వాత

అవకాశం వచ్చినపుడల్లా చైనా ఆ సూత్రాలను ఉల్లంఘిస్తూనే ఉంది. సిక్కిం సెక్టార్‌లోని డోక్లామ్ వద్ద ప్రస్తుతం అంతులేని ఉద్రిక్తతను సృష్టిస్తూ ఆ 'పంచశీల'ను తానే ఉల్లంఘించి నెపం మాత్రం భారత్‌పై నెడుతోంది. ఇది కచ్చితంగా ఖండించవలసిన అంశమే. మూడు దేశాల కూడలి (భారత్, భూటాన్, చైనా)గా పిలిచే 'ట్రై జంక్షన్' ప్రాంతంలో ఇంత కాలం లేని ఉద్రిక్తత ఇప్పుడు కనబడుతున్నదంటే ఆ 'పంచశీల'ను చైనా ఉల్లంఘించడం వల్లనే. దానిని కప్పిపుచ్చుతూ భారతదేశమే యుద్ధ సన్నాహాలు చేస్తున్నదని అనవసరంగా గగ్గోలు పెడుతోంది. చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ గాని, అధికార వార్తా సంస్థ జిన్‌హువాగాని రెండు వారాలుగా నిత్యం వీలయినంత ఇలాంటి బురద భారత్‌పై చల్లుతూ ప్రపంచం దృష్టిలో భారత్‌ను దోషిగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ తగినంత 'మద్దతు' దొరకక పోవడంతో ఆ దుష్ప్రచారమంతా దూదిపింజలా ఎగిరిపోతోంది.

****

మూడు దేశాల కూడలి అయిన డోక్లామ్ ట్రై జంక్షన్ వద్ద చెలరేగిన జగడాన్ని అడ్డుపెట్టుకొని ఏదో సాధించాలనుకోవడం చైనా భ్రమ మాత్రమే అని ఆ దేశం గ్రహించవలసి ఉంది. చైనా తన సైనికావసరాలకోసం డోక్లామ్ ప్రాంతం మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టడం పూర్తిగా అక్రమం. భూటాన్‌కు చైనాతో ఎలాంటి దౌత్య సంబంధాలు లేకపోవడంతో అక్కడ జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనడానికి భారత్ సాయం అర్థించింది. ఆ దేశానికి దౌత్య, సైనికపరమైన మద్దతు ఇచ్చే బాధ్యత భారత్‌కు ఎప్పటినుంచో ఉంది. అందుకే భారత్ ముందుకు వస్తుంది గనుక-రాగానే దాడికి దిగుదామని చైనా కాచుకొని ఉంది. డోక్లామ్ వద్ద ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం అదే. భారత్ సైనికులు ఆ ప్రాంతంలో మొహరించా రంటే అది వారి బాధ్యత. కానీ చైనా అక్కడ రోడ్డు నిర్మించడం అక్రమ చర్య. ఇది భౌగోళికంగా కనిపించే యదార్థం. చైనా దానినే ఉల్లంఘిస్తోంది.

చైనా దురాక్రమణ స్పష్టంగా తెలియాలంటే ఆ ప్రాంత భౌగోళిక స్వరూపం గురించి కొంత పరిశీలించవలసి ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలతో సిక్కింను అనుసంధానించే సిలిగురి ప్రాంతానికి డోక్లామా పీఠభూమి కేవలం కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. చైనా వైపునుంచి చూస్తే డోక్లామ్ వైపు రావడానికి మార్గమే లేదు. అందుకే అక్కడ రహదారి నిర్మాణానికి నిబంధనలకు విరుద్ధంగా చైనా చేతులు కదిపింది. ఈ డోక్లామ్ ప్రాంతం చైనా సైన్యం పిఎల్ఎ (పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) అధీనంలోకి వెళ్తే ఆ దేశానికి ఎనలేని ప్రయోజనా లుంటాయని రక్షణ రంగ నిపుణుల అభిప్రాయం. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి ప్రాంతం మీదుగా ట్రై జంక్షన్‌కు వెళ్లడానికి సరైన మార్గం లేకపోవడంతో చైనా కన్ను దానిపై పడింది. రక్షణ పరంగా వ్యూహాత్మకమైన ఈ ప్రాంతానికి చాలా సమీపంలోనే డోక్లామ్ పీఠభూమి ఉండడంవల్ల దానిని అధీనంలోకి తెచ్చుకొంటే భూటాన్, భారత్‌లు రెండూ ఒకేసారి కంట్రోల్‌లోకి వస్తాయని చైనా భావిస్తోంది.

ఈశాన్య భారతదేశంతో మిగతా భారత దేశాన్ని కలిపే సన్నని కోడిమెడలా (చికెన్ నెక్) ఉండే ప్రదేశాన్ని చేరుకోవాలంటే అక్కడ రోడ్డు నిర్మించడమే మార్గమని చైనా భావించింది. దేశ భద్రత పరంగా ఆ నిర్మాణాన్ని ముప్పుగా భావించిన భారత్ అందుకే తన సేనలను అక్కడకు పంపింది. ప్రతీకారంగా భారత్ బంకర్లను పిఎల్ఎ ధ్వంసం చేసింది. గత మూడు వారాలుగా అందుకే ఆ ప్రాంతంలో అంతటి ఉద్రిక్తత ఏర్పడింది.

ఒక్క మాటలో చెప్పాలంటే- 1962 యుద్ధం తర్వాత మళ్లీ అలాంటి ఉద్రిక్తత ఆ ప్రాంతంలో ఇప్పుడు కనిపిస్తోంది. భారత్ బంకర్లను పిఎల్ఎ ధ్వంసం చేయడమంటే గిల్లికజ్జాలు పెట్టుకోవడమే. భారత్ సరిహద్దుల సమీపంలోకి చైనా ట్యాంకులు, బలగాలు త్వరితంగా చేరుకోవాలంటే డోక్లామ్ ప్రాంతంలో రోడ్డు ఉండాలి గనుక చైనా ఆ కుట్ర పన్నినట్లుగా కనిపిస్తుంది. ఇది స్పష్టంగా కనిపించే వాస్తవం. కానీ భారత్ ఏదో తనపై దాడికి యత్నిస్తున్నట్లుగా చైనా చిత్రిస్తోంది. అక్రమంగా ఆ రోడ్డు నిర్మాణానికి చైనా యత్నించకపోతే భారత్ సైన్యాలు అక్కడికి వెళ్లవు కదా!

భూటాన్-భారత్ మధ్య 2007లో కుదిరిన రక్షణ ఒప్పందం మేరకే మన సైనికులు డోక్లామ్ ప్రాంతానికి రక్షణగా వెళ్లారుగాని చైనాతో యుద్ధం చేయడానికి కాదు. వారు ఎలాంటి కవ్వింపు చర్యలకు కూడా పాల్పడలేదు. అయినా.. చైనా రెచ్చగొడుతోంది. ఇది అదనుగా ఏదో సాధించి భారత్ ఇమేజ్‌ను దెబ్బ తీయాలని ప్రయత్నిస్తోంది.

సిలిగురి కారిడార్ ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకుంటే ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలను దిగ్బంధించినట్లే. అసోం, అరుణాచల్‌తో పాటు సిక్కిం కూడా ఆ వైపునే ఉంది. ఈశాన్య రాష్ట్రాలకు నలువైపులా చైనా, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలున్నాయి. ఆ ప్రాంతాన్ని దిగ్బంధిస్తే దాదాపు 6 కోట్ల మంది ప్రజలకు సరకు రవాణా మార్గాలు మూసుకుపోతాయి. అందుకే సిలిగురి కారిడార్ అంతటి కీలక ప్రాంతం అంటారు. డోక్లామ్ నుంచి సిలిగురి కారిడార్‌కు రావాలంటే దాదాపు 130 కి.మీ. మేర ప్రయాణించవలసి ఉంటుంది. అలా చొచ్చుకువస్తే తేలికగా సిలిగిరి చైనా వశమవుతుంది. అందుకే అంత పెద్ద కుట్రకు ఒడిగట్టింది.

ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు చైనాకు ఇదే మొదటిసారి కాదు. 3498 కి.మీ. మేర ఉభయ దేశాల మధ్య విస్తరించి ఉన్న సరిహద్దులో 1962 యుద్ధం తర్వాత కూడా వరుసగా అనేకసార్లు జగడాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఏ 'ట్రై జంక్షన్'ను చైనా అప్పట్లో ఆక్రమించడం వల్ల మహా సమరం జరిగిందో చైనా ఇప్పుడు కూడా అదే బాట తొక్కుతోంది. అప్పట్లో నాటి పరిస్థితులవల్ల భారత్ విజయం సాధించలేకపోయి ఉండవచ్చు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. చైనాతో సమానంగా రక్షణ పాటవాన్ని మన దేశం కూడా సాధించింది. ఎన్నో 'ఆగ్నే' యాస్త్రాలు మన అమ్ములపొదిలో ఇప్పుడు ఉన్నాయి. పాశుపతంకంటె గొప్ప సత్తాగల బ్రహ్మోస్ క్షిపణులు ఇప్పుడు మన సొంతం. ఆ విషం చైనాకూ తెలుసు. కానీ తాటాకు చప్పుళ్లు చేస్తూ ఉంటుంది. ఇంకా 1962లోనే భారత్ ఉందనుకొంటుంది. అలా అనుకొంటోంది గనుకనే 'జంక్షన్' వద్ద మళ్లీ జగడం సృష్టిస్తోంది.

నిజానికి చైనా ఎంత అణ్వస్త్ర సంపన్న దేశమో దానికి సమ ఉజ్జీగా భారత్ ఈ ఐదున్నర దశాబ్దాలలో ఎంతో ఎదిగింది. చైనా వద్ద 200 పైగా అణువార్ హెడ్లు ఉన్నట్లు రక్షణ శాఖ చెబుతోంది. భూ ఉపరితలం, గాలిలో, సముద్రపు నీటిలో.. ఎక్కడైనా, ఎలాగైనా అణ్వస్త్రాలు ప్రయోగించగల సామర్థ్యం ఇప్పుడు మన దేశానికీ ఉంది. యుద్ధమే జరిగితే దానివల్ల ఉభయులకూ తీవ్ర నష్టమే. అలాంటి నష్టాన్ని భరించడానికి మన దేశమే కాదు, చైనా కూడా సిద్ధంగా లేదు. అయినా కయ్యానికి కాలు దువ్వుతూంటుంది. దలైలామా, అరుణాచల్ విషయంలో ఇన్నేళ్లు గడచినా, ఎంత పోరాడుతున్నా చైనా ఏం సాధించింది? ఇప్పుడూ అంతే!

జూలై 7-8 తేదీల్లో హాంబర్గ్‌లో జరిగిన జి-20 సమావేశాల్లో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల చేతులు కలిసినా మాటలు కలవలేదు. అయినా చైనా సాధించేదేమీ లేదు. పోరు నష్టం, పొందు లాభమని చైనా ఇప్పటికైనా గ్రహిస్తే ఉభయ తారకంగా ఉంటుంది.

నీటి పంటలు
హైడ్రోపోనిక్స్!

కవర్ స్టోరీ

జె.శ్యామల

నేల పరిమిత వనరు. కానీ మానవ జనాభా నిరంతరం పెరిగేదే. మరి పెరిగే జనాభాకు సరిపడ ఆహారోత్పత్తికి పరిమిత వనరైన నేల సరిపోదు కదా. అందువల్ల నేలతో పనిలేని చెట్ల పెంపకం ఆలోచన తప్పనిసరి. అదలా ఉంచితే.. కాసింత మట్టినేల లేనిదే మొక్కల పెంపకం చేపట్టేదెలా అని వాపోతుంటారు చాలామంది.. ముఖ్యంగా పట్టణ, నగర వాసులు. అలాగే నీళ్ల కోసం అల్లాడుతుంటే చెట్లకు నీళ్లెక్కడ తేగలం? అని కూడా బాధపడుతుంటారు. ఒకవేళ కాసింత జాగా ఉండి, మొక్కలు పెంచినా చీడ,పీడల గొడవ..ఈ సవాళ్లన్నిటికీ జవాబే హైడ్రోపోనిక్స్..అదే..కాసిని పోషక జలాలలో ఆరోగ్యవంతమైన మొక్కలపెంపకం...ఆ వివరాలే ఈ వారం మీకోసం...

మనిషికి నివసించటానికే కాదు, సాగుచేసుకుని, పంటలు పండించుకోవటానికి సైతం భూమే మూలం అవుతోంది. అయితే నేలతో పనిలేకుండా ఏ పంటలూ పండించలేమా? అని ప్రశ్నించుకుంటే అందుకు జవాబుగా 'హైడ్రోపోనిక్స్' కనిపిస్తుంది. హైడ్రో పోనిక్స్ అంటే మట్టితో పనిలేకుండా నీళ్లలోనే మొక్కల్ని పెంచే పద్ధతి. అయితే ఈ పద్ధతి కొత్తగా వచ్చిందా అంటే కానేకాదు. అలనాడే ప్రపంచంలోని కొన్ని నాగరికతలలో ఈ విధానం కనిపిస్తుంది.



ముఖ్యంగా ఎడారులలో నివసించేవారు ఈ విధానం అనుసరించేవారు. ఎడారులలో పంటలు పండించటం కష్టం, కారణం మట్టి ఉండదు, అంతా ఇసుక, నీళ్లు అరుదు. అందువల్ల ఎడారి ప్రజలు అతి స్వల్ప జలంతో పంటలు పండించే విధానాలను అన్వేషించారు.

ఎడారుల్లో హైడ్రోపోనిక్స్‌కు రెండు ఉదాహరణలు చెప్పుకోవచ్చు. బాబిలోనియన్లు, ఈజిప్షియన్లు నివసించింది ఎడారుల్లోనే. వారు తమ కవసరమైన ఆహారాన్ని పండించుకోవటానికి హైడ్రోపోనిక్స్ విధానాన్ని అవలంబించారు. బాబిలోనియన్లు 2000 సంవత్సరాల కంటే పూర్వమే నివసించారు. పాత్రల్లో నీళ్ల నింపి, వాటికి ఖనిజాలు చేరిస్తే ఆ పాత్రలలో కాయగూర మొక్కలను, పూలమొక్కలను పెంచుకోవచ్చని వారు కనుగొన్నారు. బాబిలోనియన్లు పాత్రలను భూమికి చాలా ఎత్తులో వేలాడదీసి ప్రపంచ ప్రఖ్యాత వేలాడే ఉద్యానవనాలను సృష్టించారు. ఈ ఉద్యానవనాలు చక్కగా ఎదిగి ప్రపంచంలోని ఏడు అద్భుతాలలో ఒకటిగా చేరాయి. ప్రాచీన ఈజిప్షియన్లు కూడా బాబిలోనియన్ కాలంవారే. వారి రచనలెన్నింటిలోనో నీటిలో మొక్కలపెంపకం గురించి రాయటం వల్ల ఈజిప్షియన్లకు హైడ్రోపోనిక్స్ చాలా ముఖ్యమైనవని తెలుస్తోంది.

ఆ తర్వాత 19వ శతాబ్దంలో జర్మన్ శాస్త్రవేత్తలు హైడ్రోపోనిక్స్‌తో మొక్కలు పెంచవచ్చని వారి ప్రయోగాలను వివరించారు. చాలా సంవత్సరాలు కేవలం శాస్త్రవేత్తలు మాత్రమే ఇంటిలోపల మొక్కలను పెంచడానికి హైడ్రోపోనిక్స్ విధానాన్ని అనుసరించారు. హైడ్రోపోనిక్స్‌ను తొలిసారిగా ఉపయోగించింది గ్రీన్‌హౌస్ ఇండస్ట్రీ. గ్రీన్‌హౌస్ యజమానులకు పూలమొక్కలు, కూరగాయల మొక్కలను ఇండోర్స్‌లో మట్టితో మాత్రమే పెంచడం తెలుసు. అయితే కీటకాలు, వ్యాధులు వంటి సమస్యలు ఎదురయ్యాయి. దాంతో హైడ్రోపోనిక్స్ విధానంలో అయితే ఈ సమస్యలు ఉండవని తెలుసుకున్నారు. అంతేకాదు, నేలపై పెరిగే మొక్కలకంటే హైడ్రోపోనిక్స్ విధానంలో పెరిగే మొక్కలు అతి తక్కువ నీటిని వినియోగించుకుంటాయి. నేలపై పెరిగే మొక్కలకు పోసే నీళ్ల మట్టిగుండా ప్రయాణిస్తాయి కానీ మొక్కలకు చేరేది తక్కువ. అదే మొక్కలు నీళ్లలోనే పెరిగితే అందులోని నీరంతా మొక్కలకే అందుతుంది. తక్కువ చోటులో, తక్కువ నీరుతో హైడ్రోపోనిక్స్ ద్వారా ఎక్కువ మొక్కల్ని పెంచవచ్చని కూడా

గ్రహించారు.

ఆ తర్వాత అతిపెద్ద హైడ్రోపోనిక్స్ వినియోగదారుగా యు.ఎస్.ప్రభుత్వాన్ని చెప్పుకోవచ్చు. రెండో ప్రపంచయుద్ధ సమయంలో ప్రభుత్వం సైనికదళాలకు కావలసిన ఆహార సరఫరా గురించి ఆలోచించవలసివచ్చింది. చాలావరకు ఆ దళాలకు స్థానికంగా ఉండే తోటలు, పొలాల నుండి ఆహారం అందేది. కానీ కొన్ని దళాలు మారుమూల పసిఫిక్ మహాసముద్రంలోని డెజర్ట్ ఐలండ్స్‌లో ఉండేవి. వారికి ఈ ద్వీపాలలో తాజా నీరు, కావలసినన్ని ఖనిజాలు లేకపోవడంతో మొక్కల సాగు కుదరలేదు. దాంతో వారు హైడ్రోపోనిక్స్ విధానాన్ని అనుసరించారు.

ప్రస్తుతంలో హైడ్రోపోనిక్స్:

రెండో ప్రపంచయుద్ధం ముగిశాక చాలా దేశాలు పంటలను మరింత సమర్ధవంతంగా పండించడానికి హైడ్రోపోనిక్స్‌కు జెనెటిక్స్‌ను జతచేశారు. జెనెటిక్స్-మొక్కలవంటి ప్రాణులకు వాటి ఆకారాలు, సామర్థ్యాలు వాటి తల్లిదండ్రులనుంచి సంక్రమించే తీరును వివరించే శాస్త్రం.

వృక్షశాస్త్రవేత్తలు మొక్కల ఆరోగ్యాన్ని, సారహీన నేలల్లోకూడా బాగా పెరిగే మొక్కల సామర్థ్యాన్ని తెలుసుకోవటానికి జెనెటిక్స్‌నే అనుసరిస్తారు. ఇందుకు చక్కటి సాక్ష్యం ఇజ్రాయిల్. ఇజ్రాయిల్‌లో నేల సారహీనమైంది. వాతావరణం కూడా చాలా పొడిగా ఉంటుంది. వారు నీటి అవసరాలకోసం సముద్రపునీటిలో ఉప్పును తొలగించి ఆ నీటిని పంటలు పండించడానికి వాడతారు.

ఉప్పు తొలగించినా కూడా ఆ సముద్రపునీరు ఇంకా ఉప్పదనం కోల్పోకపోవటమేకాక, ఆ నీటి సరఫరా తగినంతగా లేకపోవడంతో శాస్త్రవేత్తలు జెనెటిక్స్‌ను అనుసరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సైంటిస్టులు జెనిటిక్స్‌ను, హైడ్రోపోనిక్స్ విధానాన్ని కొనసాగించి, రానున్నకాలంలో ప్రపంచ జనాభాకు అవసరమయ్యే ఆహారోత్పత్తికి సాయపడ్డారు.

భవిష్యత్‌కాలంలో హైడ్రోపోనిక్స్...

భవిష్యత్తులో నేలమీద ఇతరత్రా కూడా హైడ్రోపోనిక్స్ విధానం విస్తృతంగా ఉంటుంది. గత 90 సంవత్సరాలలో ప్రపంచ మానవజనాభా రెట్టింపు అయింది. మళ్లీ 90 ఏళ్లకు మరోసారి రెట్టింపుకు చేరుతుంది. వ్యవసాయానికి ఒకసారి వాడిన భూమిని ఇళ్ల నిర్మాణానికి, నగర నిర్మాణానికి వాడతారు. ప్రతి ఒక్కరికీ ఆహారం అందించేందుకు వ్యవసాయదారులు తక్కువ భూమిలో ఎక్కువ పంటను ఉత్పత్తి చేయవలసి ఉంది. అందుకు హైడ్రోపోనిక్స్ మీదే ఆధారపడవలసి ఉంటుంది.

హైడ్రోపోనిక్స్‌ను వైద్యంలోనూ వాడతారు. నేటి కాలంలో మనం వాడుతున్న అనేకానేక మందుల ఉత్పత్తికి చాలా వరకు మొక్కలే కారణభూతాలు. ఔషధీయ మొక్కలు వాటి వేళ్ల ద్వారా మందులను విడుదలచేస్తాయని ఫార్మాస్యూటికల్ సైంటిస్ట్‌లు కనుగొన్నారు. నేల నుంచి రసాయనాలను తొలగించడం కన్నా నీటినుంచి రసాయనాలను తొలగించడం సులభము, తక్కువ ఖర్చుతో అయ్యేది కూడా. హైడ్రోపోనిక్స్ ద్వారా ఉత్పత్తయ్యే మందులు తక్కువ ఖర్చుతో తయారవుతాయి..తద్వారా వినియోగదారుడికి కూడా తక్కువ ధరలో ఈ మందులు అందుబాటులో ఉంటాయి.

జపాన్‌లో హైడ్రోపోనిక్స్..

ప్రస్తుతం జపాన్‌లో హైడ్రోపోనిక్స్‌లో ఎన్ఎఫ్‌టి లేదా శాండ్/ గ్రావెల్ టెక్నిక్‌లను వాడుతున్నారు. బయోటెక్నికల్ పద్ధతుతో జపనీయులు కొత్తకొత్త, అధిక ఉత్పాదక మొక్కలను రూపొందిస్తున్నారు. ఇటీవల కాలంలో సుకిబ ఎక్స్‌పోలో పెద్ద టమాటా మొక్కను ప్రదర్శించారు. ఈ మొక్క 10,000లకు పైగా టమేటోలను ఇచ్చింది. అదనపు లైటింగ్ టెక్నిక్స్‌తో ఇది సాధ్యమైందని వారు వివరించారు.

ఇక పోషకాల విషయానికి వస్తే పోషక ద్రావణంలో స్టైరోఫామ్ శ్లాబులు తేలుతూ ఉంటాయి. ఈ శ్లాబులు ఒకటిన్నర నుంచి రెండు అంగుళాల మందంతో ఉంటాయి. కొత్త మొక్క వేళ్ల కింద ఉన్న పోషక ద్రావణాన్ని చేరుకునేందుకు వీలైనంత సన్నగా ఉంటాయి. ఈ స్లాబులను పక్క పక్కనే ఉంచడం వల్ల గ్రీన్ హౌస్ ఈమూల నుంచి ఆ మూలవరకు వరుసగా ఫ్లోటింగ్ ప్లాట్‌ఫామ్ ఉంటుంది. ఆవిధంగా గ్రీన్ హౌస్‌లోని ఒక మూల మొక్కలు నాటితే, మరో మూలనుంచి ఉత్పత్తిని అందుకోవలసి ఉంటుంది. పళ్ల మొక్కలు ఇసుకలో లేదా కంకర లేదా గులక రాళ్లలో పెంచుతారు.

ఇటీవల రాక్‌వూల్ క్యూబ్స్, శ్లాబులలో పెంచుతున్నారు. కృత్రిమ వెలుతురు ఏర్పాటు వల్ల మొక్కకు వాతావరణంతో సంబంధం

లేకుండా ఎదిగే వీలుంటుంది. ఈ విధానాన్ని వీరు డెన్మార్క్, యు.ఎస్‌లనుంచి ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం జపనీయులు రీ సర్కులేటింగ్ న్యూట్రిషంట్ టెక్నిక్‌లలో ఆసక్తి చూపుతున్నారు. కూరగాయల మొక్కల పెంపకానికి వారు ఎక్కువగా హైడ్రోపోనిక్స్‌నే అనుసరిస్తున్నారు. దోస, పుచ్చ, టొమేటోలు, స్ట్రాబెర్రీలు, రాడిష్, లీక్స్ అండ్ గ్రీన్ వెల్ష్ ఉల్లిపాయలు, లెట్యూస్, హోన్‌వార్ట్ మొదలైన వెన్నో హైడ్రోపోనిక్స్ విధానంతో పండిస్తున్నారు.

ఫునబషి నగరంలోని డాయి సూపర్ మార్కెట్‌లో హైడ్రోపోనిక్స్‌లో అనుసరించే ముఖ్యమైన అప్లికేషన్ ఎన్ఎఫ్‌టి సిస్టమ్. ఒక టెక్నీషియన్ కంప్యూటర్‌ను ఆపరేట్ చేస్తుంటే ఇతరులు పంటను పరిశీలిస్తారు. లోపల గాజు కిటికీలతో కూడిన 70 చదరపు గజాల ప్రయోగశాలను బయట నుంచి పరిశీలిస్తే లోపల ప్లాస్టిక్ బెడ్‌లలో పెద్దపెద్ద ఆకులు గల లెట్యూస్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా కనిపిస్తాయి. కంప్యూటర్ ఉష్ణోగ్రతను, వెలుతురును,

తేమను, పోషకాలను, కార్బన్ డై ఆక్సైడ్‌ను, నీటిని తగుమాత్రం ఉండేలా అదుపుచేస్తుంది. నీటితో నిండిన కానిస్టర్‌లలో విత్తనాలు పెరుగుతాయి. ఆకులు రాగానే టెక్నీషియన్ వాటిని 1 ఇంచ్ రాక్‌వూల్ క్యూబ్స్‌లోకి మారుస్తారు. ఐదు ఆకులు వచ్చేవరకు వాటిని ఇలాగే విడిగా పెంచుతారు. అప్పుడు దాన్ని ప్లాస్టిక్ బోర్డుపైని రంధ్రానికి గుచ్చుతారు. ఆ తర్వాత కొన్ని రోజులకు వన్ ఇంచ్ క్యూబ్స్‌లోని మొక్కలను, మొక్కలను పెంచే ప్రధాన తావుకు తరలిస్తారు. కన్వేయర్ బెల్ట్ మాదిరి ఈ బోర్డు నీటిలో తేలుతూ, పోషక ద్రావణంలో తిరుగుతుంటుంది. గతంలో ఈ మొక్కలు దిగుబడుల నివ్వడానికి 80 రోజులు పడితే ఇప్పుడు 35రోజులకే కాపుకొస్తున్నాయి. సంప్రదాయవిధానంలో పండించిన కూరల కంటే కేవలం 2-4 శాతం ఎక్కువ ధరకు వీటిని అమ్ముతున్నారు. పోషకాలతో కూడిన, శుభ్రమైన లెట్యూస్‌ను కాస్తంత ఎక్కువ రేటుకు కొనడానికి జపనీస్ గృహిణులు వెనుకాడటంలేదు. ఈ

అత్యధిక ప్రయోజనాల హైడ్రోపోనిక్స్!

* హైడ్రోపోనిక్స్ సాగు విధానంలో భూమి అవసరంలేదు. ఇదే అత్యంత ప్రయోజనకర అంశం. ఎందుకంటే భూమి అనేది పెరిగేది కాదు. జనాభా పెరుగుతుంది. అంటే ఉన్న భూమినే ఎంతకాలమైనా, పెరిగిన జనాభాకు సైతం వినియోగించుకోవలసి ఉంటుంది. అటువంటప్పుడు ఉన్న భూమిని మేలైన పద్ధతిలో వినియోగించుకోవటానికి మార్గం హైడ్రోపోనిక్స్.

* హైడ్రోపోనిక్స్ వల్ల భూసార సమస్య ఉండదు. సారవంతమైన నేల లేని అంటార్కిటికా, స్పేస్ స్టేషన్లు, స్పేస్‌కాలనీలకు ఈ విధానం ఎంతో అనువైంది.

* నేలమూలంగా వచ్చే చీడపీడలు హైడ్రోపోనిక్స్ మొక్కలకు ఉండవు.

* నేలపై పెరిగే మొక్కలకంటే హైడ్రోపోనిక్ మొక్కలకు అవసర మయ్యే నీరు తక్కువ. సంప్రదాయ తోటల కంటే హైడ్రోపోనిక్ గార్డెన్‌లు 2/3 వంతు తక్కువ నీరు వినియోగించు కుంటాయి.

* స్ట్రా బెర్రీల వంటి పంటలను హైడ్రోపోనిక్ పద్ధతిలో తక్కువ వ్యయంతో పండించుకోవచ్చు.

* హైడ్రోపోనిక్స్ విధానంలో మొక్కలకు అధిక వెలుతురు అందుతుంది.

* పర్యావరణానికి ఇవెంతో మేలుచేస్తాయి. ఎందుకంటే హైడ్రోపోనిక్ తోటలకు, సంప్రదాయ తోటలకు అవసరమయ్యే భూమిలో కేవలం 10శాతం మాత్రమే సరిపోతుంది. ఇళ్లలోపల ఎక్కడైనా హైడ్రోపోనిక్ మొక్కలను పెంచుకోవచ్చు.

* కార్బన్ ఫుట్‌ప్రింట్ ఉండదు. హైడ్రోపోనిక్ పంటలను స్థానికంగా పండించి, స్థానికంగా అమ్మడం వలన పూల, పళ్ల, కూరగాయల రవాణా అవసరం ఉండదు. అందువల్ల రవాణాకు అయ్యే వ్యయం తగ్గిపోతుంది.

* అందరికీ అందుబాటులో ఉండే పద్ధతి ఇది. తక్కువ బడ్జెట్‌తోనే హైడ్రోపోనిక్ సాగు ప్రారంభించవచ్చు. సూపర్ క్లోజెట్ క్యాబినెట్ లేదా సూపర్ క్లోజెట్ గ్రోరూమ్ అమర్చుకుని హైడ్రోపోనిక్ సాగుచేయవచ్చు.

* హైడ్రోపోనిక్స్ విధానంలో అధిక దిగుబడులు వస్తాయి. పెరిగే జనాభాకు వీలుగా పంటలు పండించే సౌలభ్యం హైడ్రోపోనిక్స్‌లో ఉంది.

* హైడ్రోపోనిక్స్ తోటల వల్ల రుచికరమైన, పౌష్టిక విలువలతో కూడిన, ఆరోగ్యకర దిగుబడులను పొందవచ్చు.

* హైడ్రోపోనిక్స్ విధానం వల్ల సంవత్సరం పొడవునా పంటలు పండించుకోవచ్చు.

* మొక్కలను అంతస్థులవారీగా నిలువుగా పెంచే వీలున్నందున చాలా తక్కువ భూమి మాత్రమే వీటికోసం వినియోగమవుతుంది. అంటే తక్కువ నేలను ఉపయోగించి, అత్యధిక మొక్కలను పెంచే వీలు కలుగుతోంది.

సూపర్‌మార్కెట్ 5 వేర్వేరు రకాల లెట్యూస్‌ను ఉత్పత్తి చేస్తోంది. వ్యవసాయానికి పరిమిత భూమి ఉన్న దేశాలకు హైడ్రోపోనిక్స్ ఎంతో ఉపయోగిస్తుంది. జపాన్‌లో కొంతమంది బహుళ అంతస్తుల భవనాలకు హైడ్రోపోనిక్స్ మేలైనదని భావిస్తున్నారు.

మనదేశంలో.. గురుగ్రామ్‌లో హైడ్రోపోనిక్స్ సాగు..

భారత్‌లోని గురుగ్రామ్‌లో హర్యానా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్‌వారు హైడ్రోపోనిక్స్ విధానంలో రసాయనాలు లేని సురక్షితమైన పండ్లను కాయగూరలను పండించి ఢిల్లీ, గురుగ్రామ్ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. కొత్తతరం వ్యవసాయ దారులు ఇప్పుడు మట్టితో పనిలేని హైడ్రోఫోనిక్స్‌నే అనుసరిస్తున్నారు. పంచగావ్, మానెసార్‌లలో ఇప్పుడు ఈ విధానమే ఆచరణలో ఉంది. మట్టికి బదులుగా కొబ్బరి పీచుతో కుండీలను నింపి, ద్రవ రూపంలో పోషకాలను అందించి వాటిని పెంచుతున్నారు.

ఈ ప్రాజెక్టును 2015లో రూపేష్ సింఘాల్, అవినాష్ గర్గ్, వినయ్ జెయిన్ అనే ముగ్గురు ఐటి ప్రొఫెషనల్స్ ప్రారంభించారు. వీటికి ఇండోర్ ఫామింగ్ టెక్నిక్‌లను ఉపయో గిస్తున్నారు. హైడ్రోఫోనిక్ పద్ధతిలో టొమేటోలు, యూరోపియన్ కుకుంబర్, చెర్రీ టొమేటోలు, బెల్ పెప్పర్స్, తమలపాకులు, పార్స్లీ, రోజ్‌మేరీ వంటివి పండిస్తున్నారు. ఇందుకు 60లక్షల రూపాయల పెట్టుబడి పెట్టామని, ఏటా నిర్వహణ వ్యయం 20 లక్షల రూపాయల వరకు అవుతోందని తెలిపారు. అయితే వారికి ఎరువులతో, క్రిమిసంహారక మందులతో పనిలేదు. ఎందుకంటే తగిన వాతావరణంలో వీటిని పెంచుతున్నారు. కాయగూరలకు అల్ట్రావయొలెట్ కిరణాలు సోకకుండా పాలిథిన్ షీట్‌ను వాటిపై ఉంచుతున్నారు. సురక్షితమైన, ఆరోగ్య కరమైన పరిసరాలలో మొక్కలు పెరిగి రసాయనరహిత కాయగూరలను, పళ్లను అందిస్తున్నాయి అంటారు ఆప్రాజెక్టులో పనిచేసే ధ్రువకుమార్ అనే రైతు. ఈ ఫామ్‌లో రెండు -రివర్స్ ఆస్మాసిస్ నీటి ప్లాంట్‌లను ఏర్పాటుచేశారు. ఒక్కో ప్లాంట్ సామర్థ్యం గంటకు 1000లీటర్లు. ఈనీటిని మొక్కలకు అందిస్తారు.

ఇక హైదరాబాద్‌లో షాబాద్‌లో ఉన్న ఫ్రెస్కో సెంటర్ ఆఫ్ ప్రెసిషన్ ఫామింగ్ (సిపిఎఫ్) వారు భారత్‌లోనే పెద్ద ఎత్తున కమర్షియల్ హైడ్రోపోనిక్స్ చేపట్టిన సంస్థగా గుర్తింపు పొందారు. ఫ్రెస్కోవారు రైతులకు హైడ్రోపోనిక్స్‌లో శిక్షణ సైతం అందిస్తున్నారు. వారికి కావలసిన సాంకేతిక సహాయం కూడా సమకూరుస్తున్నారు.

భారత్‌లో ఆహారోత్పత్తి భవిష్యత్తు హైడ్రోపోనిక్స్‌దేనా?

గతంలో కంటే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వారు వినియోగించే ప్రతిఉత్పాదన గురించి నిశితంగా ఆలోచిస్తున్నారు. వాటి ఉత్పత్తి ఎలా జరుగుతోంది, వాటిని తామెలా వినియోగిస్తున్నామని విశ్లేషిస్తున్నారు. సురక్షిత, ఆరోగ్యకర ఆహారం కావాలన్న డిమాండ్ నేడు పెరిగిపోయింది. అందువల్ల ఆహారోత్పత్తి కంపెనీలకు, పరిశోధకులకు ఉత్పత్తులు ముఖ్యంగా పళ్లు, కాయగూరలు రసాయన రహితంగా, సురక్షితంగా పండించడానికి కొత్త సాంకేతిక పద్ధతులను చేపట్టవలసిన అవసరం ఏర్పడింది. దాని ఫలితమే హైడ్రోపోనిక్స్. ఇందులో మొక్కకు కావలసిన పోషకాలు నీటిలోనే లభ్యమవుతాయి. కాలం, చోటు కూడా ఆదా అవుతుంది.

ఈ విధానంలో ముఖ్య మైంది తగిన వెలుతురు. లెడ్ లైట్లను ఏర్పాటుచేయ డం ద్వారా కిరణజన్య సంయోగ క్రియ జరిగే వీలేర్పడుతోంది. ముఖ్యంగా పట్టణా ల్లోనివారికి తక్కువ నీటితో, తక్కువచోటులో పెంచుకునే హైడ్రోపోనిక్ మొక్కలు ఎంతో అనువైనవి. వీటిని కిటికీలలో, బాల్కనీ లలో, ఇంటి పైకప్పులలో, పెరడులో పెంచుకోవచ్చు. ఉత్తమమైన, మంచి పోషకా లతో కూడిన అధిక ఉత్పాదనలు హైడ్రోపోనిక్ సాగులో సాధ్యపడతాయి. పర్యావరణ హితంగా ఉండే హైడ్రోపోనిక్స్ విధానాన్ని అను సరిస్తే అన్ని విధాల ప్రయోజనం చేకూరుతుంది.

నివాసాలు చిన్నవైనా మొక్కలు పెంచుకోలేమనే చింత హైడ్రోపోనిక్స్ విధానంతో తీరుతుంది. నేలలో పెరుగుతూ, సమృద్ధిగా నీరునందుకుంటూ, సూర్యకాంతిలో పెరిగే మొక్కలకు దీటుగా, ఇంకా చెప్పాలంటే అంతకంటే ఎక్కువ ఆరోగ్యవంతంగా, బలంగా హైడ్రోపోనిక్స్ మొక్కలు ఎదిగి,పుష్కల పంటలనిస్తాయి. ఎటువంటి రసాయనాల హాని ఉండదు. సొంతంగా మొక్కల్ని పెంచి, కాయగూరలను, పళ్లను, పూలను పొందే తృప్తి అందరికీ ఈ హైడ్రో పోనిక్స్ వల్ల లభిస్తుంది. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే నగర ప్రజలకు తోటను పెంచుకోవాలనే కలను నెరవేర్చేది హైడ్రోపోనిక్స్ విధానమే. ఎన్నో లాభాలున్నందువల్ల భవిష్యత్ కాలం హైడ్రోపోనిక్స్ సాగుదే అంటున్నారు నిపుణులు.

కవిత్వంతో కరచాలనం చేయడమంటే...

కవిత్వంలో జీవన విశ్లేషణ ఉంటుంది. జీవితం స్పష్టం చేయలేని దాన్ని కవిత్వం స్పష్టంచేస్తుంది. అది సాధ్యం కావాలంటే ముందు సాహిత్యంలో స్పష్టత ఉండాలి. అలా ఉండాలంటే వస్తుశిల్పాల సమన్వయం కుదరాలి. కాలం తెచ్చిపెట్టిన సరికొత్త ఉద్వేగాలకూ సున్నితమైన భావాలకూ స్పందించాలి.

కవిత్వ దర్శనం ఎంత నూతనమో, అంత సనాతనం. స్ఫురణ, దుఃఖం, ఆనందం, వేదనల మధ్య కూడా కవిత్వం మధురూహల హస్తాల్లోకి అందుకొని లాలిస్తుంది. కవిత్వ మూల్యాంకనం ఎంత ముఖ్యమో మూల్యాంకనం కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే ఒక జాతికి సంస్కృతికి మూలాలు ఉన్నట్లే కవిత్వానికి మూలాలు ఉంటాయి.

కవిత్వమంతటినీ జీవధారల్లా అల్లుకొని ఉండాల్సిన స్పష్టమైన తాత్విక నేపథ్యం కవిలో లోపించడం వల్ల కొన్ని పరిమితులు ఏర్పడుతున్నాయేమో ఆలోచించాలి. కవిత్వం రాసే సందర్భాన్ని అంత సీరియస్‌గా భావించకపోవడం ఈ పరిమితికి బయటికి కనిపించే ప్రధానకారణం.

కవిత్వమంటే-అక్షర నాట్య విన్యాసమని, సమాసాల చూపుల కోలాటంలో ప్రేమ స్వరూపమనీ, చివరికి స్పందించే హృదయ భావనా వ్యక్తీకరణమని కొందరు అంటారు. కేవలం భావనా వ్యక్తీకరణమే కవిత్వమనుకుంటే..చిన్నపిల్లగాని మాటలు, పిచ్చివాని ప్రేలాపనాలూ కవిత్వం కావాలి. ఏ భావనా లేకుండా ఎవరూ మాట్లాడరుకదా. ఎవరు ఏది మాట్లాడినా అదంతా కవిత్వమనేవాళ్లు ఉన్నారేమో కానీ నమ్మేవాళ్లయితే ఎవరు అంతగా ఉండరేమో...

కవిత్వంలో కొత్త వస్తువు రాకుండా, కొత్త ప్రతీకరాదు. వస్తు అంతర్విస్తృతి జరగకపోతే.. కవిత్వంలో జడత్వం పెరిగిపోతుంది. కవిత్వం ఒక నదీ ప్రవాహం. అది నిరంతరం సాగిపోతూనే ఉంటుంది. దాని గమ్యం సాహితీ సాగరసంగమమే. అదెప్పుడూ ఘనీభవించదు.

కవిత్వం, జీవితం వేరువేరుగా ఉంటాయనేదే పొరపాటు. జీవితం లేనిదే కవిత్వంకాదు. కవిత్వీకరించనిదే జీవిత వాస్తవికత అర్థంకాదు. సమాజంలోని సమస్యలే, సంఘర్షణలే కవిత్వమైతే- అందులోంచి పాఠకులకు విషయం సులువుగా అర్థమవుతుంది.

లోలోపల భావనా సరస్సున్న మనిషి మాత్రమే బయట కవితా సముద్రాల్ని సృష్టించగలడు. ఆకాశానికి ఆలోచనా ఆలాపన నేర్పగలడు. అటువంటి కవి ఎవరి వెనుకా నడవడు. అవసరమైతే నీడకింద ఆలోచనలతో వాడవాడా సంచరించగలడు.

కవి విశ్రాంతంగా బతకడు. అక్షరాల్ని ప్రశాంతంగా బతకనీయడు. తుఫానై విరుచుకుపడతాడు. అక్షరాల్ని మందుపాతరల్ని చేసి పేల్చా లనుకుంటాడు. మనల్నీ అదేపని చేయమంటాడు. నిజమే. శాంతంగా బతకాలనుకునేవాళ్లు కవితా కదలిలు కాలేరు.

కవి ఒంటరిగా ఉన్నప్పుడు తనలో ఉన్న అనేకమంది వ్యక్తుల్ని ఎదుర్కొని, వారితో సంఘర్షిస్తాడు. తత్ఫలితంగా ఎక్కువకాలం తన చుట్టూ ఉన్నవారికి అప్పుడప్పుడు తనకుతాను కూడా పరాయివాడుగా మిగిలిపోతాడు. ఈ పరిస్థితిని కవికి సంబంధించినంతవరకు పరాయీకరణగా భావించవచ్చు.

కొంతమంది కవులకు సాధారణంగా ఆలోచిస్తూనే అసాధారణ విషయాన్ని వ్యక్తీకరించే 'టెక్నిక్' అబ్బుతుంది.ఈ విధమైన టెక్నిక్ వీరి కవిత్వాన్ని అసాధారణమైందిగా నిలపడంలో దోహదపడుతుంది. అందువల్లనే సాదాసీదాగా, మాట్లాడుతున్నంత అలవోకగా చాలాచోట్ల అనిపించినా ఈ అసాధారణ తత్వం వల్ల గొప్పగా నిలుస్తుంది.

సాహితీవనం

ఏ వాదాలూ.. వివాదాలూ పట్టని ఏకాంతవాస కవులు కొందరుంటారు. అర్థరాత్రికాదు, పట్టపగలు కరెంట్ పోతేనే ఉలికిపడే వీరు దుఃఖం గురించి, మృత్యువు గురించీ, మార్మిక కవిత్వాన్ని పేనుతారు. జీవితంలో వాటి వాసన సైతం దరిచేరనీయరు మళ్లీ. అందుకు ఎన్ని అడ్డదారులైనా సిద్ధమే.

ఒక్కరాత్రిలో మంచి కవిత్వం పుట్టదు. ఎన్నో రాత్రులు దాన్ని చెక్కాలి. దానికి మనం చిక్కాలి. అప్పుడు అది బతుకు మడుగులో జలకమాడుతుంది. అనేకానేక లోతుల్లోకి దూకుతుంది. అనేకానేక ఎత్తులకు ఎగబాకుతుంది. ఒకచోట నిలవదు. ఒక చోట చేరదు.

సమాజంలో సాహిత్యంపై అవగాహన, రసజ్ఞత పూర్తిగా కొరవడిందేమో. ఇలాంటప్పుడు ఇతర భాషల ఆధిపత్యం, మారిన ప్రజల అభిరుచి, కవిత్వం కొరవడిన అవగాహన చేస్తోందని ప్రస్తుతతరం కవులు తల్లడిల్లిపోతున్నారు.

గొప్ప కవిత్వం రాయటమేకాదు, కవిత్వంలా జీవించడం అంతకన్నా గొప్ప. అంతరంగ భావాలకు అక్షరాలు అద్దడంలో ఏ సంకోచం లేకుండా స్వేచ్ఛగా ఉండాలి. మనచుట్టూ తిరిగే మనుషుల్లా ఉండాలి. కవిత్వంలా జీవించే కవికి ప్రతి అక్షరం డొక్కనుంచే ఉద్భవిస్తుంది. ప్రతి వాక్యం, ప్రతి ఆలోచన మస్తిష్కంనుంచే రూపుదిద్దుతుంది.

కేవలం అతిగా రాయడానికే కవి దృష్టి పరిమితమైతే మొదట బలయ్యేది సృజనాత్మకత. ఇంకా జిజ్ఞాసకు సమాధి కట్టినట్టవుతుంది. ఆ తర్వాత జరిగేది పురోగతిలో మానవీయ కోణం మృగ్యమవుతుంది. కవి దృష్టియానంలో అక్షర ప్రగతి నక్షత్రాల్ని వెంటాడాలి. కలసీ మెలసీ రాసుకున్న వాక్యాలన్నీ ఇప్పుడు అవాక్కయి నిలుస్తాయి. కల మీద కల గుమ్మరించినట్టుగా చాలా అమాయకమైన ప్రేమలతో కవిత్వం మొదలవుతుంది. ఎందుకట్టెల్లా బతకడాన్నీ, దుంగల్లా పేర్చిన టింబర్ డిపో కవిత్వాన్ని కసిదీరా తిట్టడమే పనిగా పెట్టుకోవడం మొదలవుతుంది.

ఎక్కడ మొదలుపెట్టి, ఎక్కడ ఆపాలో తెలియకుండా పుట్టుకొచ్చేదే కవిత్వమైతే, అది సముద్రాన్ని తొలిసారిచూస్తే, అలలపొంగే కనిపిస్తుంది. ఒక్క క్షణమాగి దృష్టి సారిస్తే అంతుపట్టని లోతు, నిశ్చలత్వం, అగాధ నీలిమ అనుభవంలోకి వస్తాయి. కవి వికాసంలో విశాల హృదయంది పెద్దపాత్రే. అందువల్లే కవులు అందాన్ని ప్రేమించడమేకాదు, అన్యాయాన్ని కూడా అంతగా ద్వేషిస్తారు. తమ పద్ధతిలో తిరగబడతారు. రహస్యోద్యమాలు చేస్తారు.

వర్తమాన కవిత్వం ఎలా వుంది..? ఇంకెలా ఉండవలసి ఉంది?! మరెలా ఉండవలసిన రీతిలో ఎందుకు ఉండడంలేదు!? ఇతరేతర భారతీయ భాషలతోగానీ, అంతర్జాతీయ సృజనలతోగానీ, పోల్చినప్పుడు ఎలా దర్శనమిస్తుంది!?! ఇత్యాది ప్రశ్నలు సామాన్య పాఠకుల మదిలో శేషప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి.

-ఎస్.ఆర్.భల్లం

కృతి

చిక్కని, చక్కని కవిత్వం!

'మొన్న ములాఖాత్', నిన్న ఈ నేల వెన్నెల కాయనీ'.. ఈ సంవత్సరం తాజాగా హైదరాబాద్ కవుల వేదిక డా.ఏనుగు నరసింహారెడ్డి సంపాదకత్వం లో 47కవితలతో వెలువరించిన సంకలనం 'గునుగు పూల పొద్దు'. కవిత్వ పరిణామం రికార్డు చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ఒక కవిత్వ సంకలనం వెలువ రించడం వేదిక ప్రధాన ఉద్దేశం, సంప్రదాయంగా గమనించవచ్చు. హైదరాబాద్ కవులు కదా, అందుకే మహానగరంలోని చారిత్రాత్మక కట్టడాలను వర్ణించి తన్మయులవుతూ, హైదరాబాదులు కళ్లకు కద్దూ, మూసీనది ప్రక్షాళనావశ్యకతను వెలికితీస్తూ, భాగమతి విశిష్ట అందాన్ని, సొగసులు రాలిపోకుండా కాపాడుకుందామని పిలుపునిస్తూ కవులు తమ కలాలను ఝళిపించారు. బంగారు తెలంగాణ నిర్మాణ ఆకాంక్ష చాలా కవితల్లో తొణికిసలాడుతుంది. కోర్టులు విధించే ఉరి శిక్షలను చట్టబద్ధ హత్యగా ఎత్తిచూపుతూ, ప్రపంచీకరణ, సరళ ఆర్థిక విధానాల సంకెళ్ల నుండి సామాన్యుడికి విముక్తి కలిగించి బతికించు కోవాలనే మానవీయ ప్రకటనచేస్తూ, మనిషి తననుతాను ఆవిష్కరిం చుకునే ప్రయత్నంలో తాత్వికంగా పలవరిస్తూ, ఒక గ్రామీణుడి నాస్టాల్జియాను కవిత్వీకరిస్తూ కవితలన్నీ కమ్మని అనుభూతుల్ని కలిగిస్తాయి. లబ్ధప్రతిష్ఠులైన కవులు అందించిన చిక్కటి కవిత్వమిది.

(గునుగుపూల పొద్దు- కవితా సంకలనం: సంపాదకుడు: ఏనుగు నరసింహారెడ్డి; వెల:రూ.60; ప్రతులకు: పాలపిట్ట బుక్స్)

-రమణ వెలమకన్ని

పాఠకుడిని ప్రభావితం చేసే కథలు

సమాజంలోని అంశాలనే కథావస్తువులుగా చేసు కొని నందూరి సుందరీ నాగమణి వెలువరించిన కథా సంకలనం 'నువ్వు కదలివైతే'. సంకలనంలోని కథల న్నీ ఇల్లు, ఇల్లాలు, ఆఫీసు, ఉద్యోగం, అత్తమామలు, ఆడ పడుచులమధ్య సాగుతాయి. సంసారాన్ని సమర్ధ వంతంగా నడుపుతూ కుటుంబవ్యవస్థనీ, గృహిణీ ధర్మాన్ని నిభాయిస్తాయి. అలా అని బేలగా ఉండవు. ఉద్యోగినిగా గృహిణిగా తాను ఎదుర్కొంటున్న శ్రమను అత్తగారు గుర్తించలేకపోతే, ట్రాన్స్‌ఫర్‌తో దూరంగా ఉంటూ అత్తగారికి గుణపాఠం నేర్పుతుంది కుసుమ. 'భొరుసు' కథలో తన ఉనికిని, భార్య సాంగత్యంలో నిర్ల క్ష్యంచేస్తే, నిస్సహాయురాలుగా మారక, చుట్టూ ఉన్నవారితో ఓ ఆత్మీయ ప్రపంచాన్ని నిర్మించుకుని, అత్యవసర పరిస్థితుల్లో కొడుకు, కోడలును ఆదుకుంటుంది. జన్మనేకాదు, పునర్జన్మనూ ప్రసాదిస్తుంది 'జగన్మాత'లాంటి ఓ తల్లి. నిజాయితీగా ఉండే పనిమనిషినైనా, సాటి మనిషిలా ఆదరించాలని, తప్పుల్ని నిండుమనసుతో క్షమించాలని 'అడగని వరం'లో మాధవి చెబుతుంది. 'వృద్ధాప్యం' రెండో బాల్యం వంటిదని, తల్లి అంబుజమ్మద్వారా ప్రకటిస్తూ వారు కుటుంబ వాతా వరణంలోనే ఆనందంగా ఉండగలరంటారు. కుటుంబాల్లో నాన్నది కనిపించని పాత్రే అయినా, నారికేళంలా లోన తీయని కొబ్బరి, నీళ్లూ ఉంటాయంటారు. సామాజికసౌందర్యాన్ని పెంపుచేసే కథలివి!

(నువ్వు కదలివైతే : నందూరి సుందరీ నాగమణి; వెల: రూ. 150; ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు)

-కూర చిదంబరం

డబుల్ ధమాకా కథల సంకలనం..



అందరికీ నచ్చేలా ఉండాలని కాబోలు రచయిత భీమరాజు వెంకటరమణ 'కథలు-హాస్యకథలు'పేరిట రెండు రకాల కథల్ని ఓ సంకలనంగా వెలువరించా రు. తొలికథ 'సారీ..సారీ వైదేహీ' కథలో వైదేహి పరిణిత వ్యక్తిత్వాన్ని, సుమంత్ డోలాయమానస్థితిని, చివరకు తనకేం కావాలో తెలుసుకోగలగటాన్ని చిత్రీక రించిన తీరు బాగుంది. 'నమ్మకం' కథలో ప్రతికూల అంశాలనుదాచి గెలుపు సాధించటం కన్నా, నిజంచెప్పి అవతలి వారి మనసును గెలవటం మేలని చక్కగా చెప్పారు. 'ఆమె మనసు' మరో చక్కని కథ. పరిస్థితుల ప్రాబల్యం వల్ల నీలిమ, అభీని పెళ్లి చేసుకోలేకపో యినా, అతడి జీవితంలో వెలుగు తన బాధ్యతగా భావించి, తెలివి గా అతడి మనసు మారుస్తుంది. 'అసమర్థులు కావలెను' కథ మంచి సందేశాత్మకంగా ఉంది. ప్రకాష్, స్వాతి పాత్రల చిత్రణ బాగుంది. హాస్యకథల్లో 'అద్దెకివ్వబడును' కథలో ఆదినారాయణ జంటకు కొత్త ఇంట సంగీత, సాహిత్య, నృత్యాల హింస కడుపుబ్బ నవ్విస్తుంది. 'విజన్ 2040' కథలో తారుమారైన పెళ్లి పరిస్థితులు చదువుతుంటే నవ్వులే నవ్వులు. 'టీ.వీ.007' కథ నేటి టీవీ ఛానెల్స్ ప్రోగ్రామ్స్ మీద చక్కని సెటైర్. 'రమ్య... రమేష్...రామ్మూర్తి' కథలో కొడుకు చదవటంకోసం తండ్రి ఆడే ప్రేమనాటకం పకపక నవ్విస్తుంది. చక్కటి కథలు చదివిన తృప్తి నిచ్చే డబుల్ ధమాకా సంకలనమిది.

(కథలు-హాస్య కథలు: భీమరాజు వెంకట రమణ; వెల:రూ.80; ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట్, హైదరాబాద్-36)

-ప్రభాస

ఇవీ అందాయి..



గంగాళం -కవిత్వం
పప్పుల రాజిరెడ్డి
వెల: రూ.30
ప్రతులకు:అన్ని ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాలు.

శ్రీ సాయి శతక త్రయి
డా.కపిలవాయి లింగమూర్తి
వెల: రూ.60
ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తకకేంద్రాలు.





నానీ కెరటాలు: హర్షవర్ధన్
వెల:రూ.50
ప్రతులకు:హర్షవర్ధన్, 203, చాముండేశ్వరి అపార్ట్‌మెంట్స్, సుందరనగర్, ఫ్లాట్-24, హైదరాబాద్-500038

డా.ఆర్.అనంత పద్మనాభరావు
సమగ్ర సాహిత్యం-పరిశీలన
డా.శ్రీమతి ధన్వంరాజు నాగమణి; వెల: రూ.200,
ప్రతులకు:నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురు వీధి, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్-27.

రక్తి వీడి, ముక్తి కోరి..

కస్తూరి మురళీకృష్ణ

అతడి వదనంలోకి చూస్తూనే ఆమె హృదయంలో అంతవరకూ ఎన్నడూ తెలియని భావతరంగాలు ఉవ్వెత్తున ఎగిశాయి.

ఆ భావతరంగాలు వినూత్నత్వానికి, తీవ్రతకూ ఆమె ఉక్కిరిబిక్కిరి అయింది.

తనకోసం గొప్పవాళ్లుగా చలామణీ అయ్యేవారంతా కాట్లకుక్కల కన్నా కనాకష్టంగా పోరాడుకోవటం తెలుసామెకు. తన పొందుకోసం ఎంతెంతో శక్తిమంతులు, విజ్ఞానమంతులు పిచ్చివాళ్లలా ప్రవర్తించారు.

ఎందరో నాగరీకులు అనాగరికులయిపోయారు.

అత్యంత శక్తిమంతమైన రాజు, తనకు దాసానుదాసుడయ్యాడు. తనకోసం తన ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కూడా వదలిపెట్టాడు. తన ప్రేమకోసం అపఖ్యాతిని కౌగలించుకున్నాడు.

తనకోసం నగరాలు నాశనమై పోయాయి. రాజ్యాలు కూలిపో యాయి. కానీ..ఇలా ఎప్పుడూ తనలో సంచలనం కలగలేదు.

తనకు బోధపడని సంచలనం ఇది. తన బుద్ధికి అందని సంచలనం ఇది.

తన ఆత్మ లోలోతుల్లో జనించి, తన అంతరాత్మ మరచిన మధురమైన జ్ఞాపకాల్ని తెలపాలన్న తపనతో సాగుతున్న సంచలనం ఇది అనిపిస్తోంది.

ఇదంతా కేవలం అతని దర్శనమాత్రంతో సంభవిస్తోంది.

ఇదెలా సాధ్యం? మరోసారి కళ్లెత్తి అతనివైపు చూసింది ఆమె.

ఈసారి అదే భావన మరింత ఉధృతంగా కలిగింది.

అయితే ఆ భావనలో ఉక్కిరిబిక్కిరి చేసే లక్షణంలేదు. ప్రశాంత శాంతసాగరంలో అత్యంత ఆనందాన్ని అనుభవిస్తూ ఈదులాడుతున్న మనోహరమైన లక్షణం ఉంది. ఆమె మరోసారి అతని వైపు చూసింది. ఈసారి అతని కళ్లు ఆమె కళ్లతో కలిశాయి.

అప్రయత్నంగా ఆమె హృదయ లోలోతుల్లోంచి, తన హృదయంలో ఉన్నాయని తనకే తెలియని లోలోతుల్లోంచి, తన హృదయంలో దాగున్న అంతరిక్షపు అగాథాల లోలోతుల్లోంచి వెలువడిన దీర్ఘమైన నిట్టూర్పు బహిర్గతమైంది.

అతని కళ్లు ఆమె హృదయపు చీకటి లోతుల్లోకి చీల్చుకుని వెలుతురు పంచుతున్నట్టున్నాయి.

అతని కళ్లలో ఆమె బాహ్య సౌందర్యంపట్ల అభినందన కనిపించటంలేదు. అతని చూపుల్లో ఆమె పట్ల కోరిక కానీ, కాంక్ష కానీ కనిపించటంలేదు. అతని నయనాలలో మామూలు భౌతిక ప్రపంచానికి సంబంధించిన భావనలేవీ లేవు. కానీ కరుణ, ప్రేమ వంటి బావనలు కలగలిసిన ఒక ఉత్కృష్టమైన వెలుతురు ప్రసరణ అతని నుండి తనలోకి చేరుతున్న భావన కలిగింది ఆమెకు.

అతని పాదాల వాలిందామె!

'స్వామీ..నా ఆతిథ్యం స్వీకరించండి. నా జన్మను ధన్యం చేయండి. నా పాప ప్రక్షాళన చేయండి. నాకు నూతన జన్మను ప్రసాదించండి. నా ఆస్తి ఐశ్వర్యం సర్వం మీకే అంకితం'.

తనలో తనకే తెలియని భావావేశం పరవళ్లు తొక్కుతూంటే, తన ప్రమేయం లేకుండా ఆమె మనస్సులో మాటలు పెదవి దాటి వెలువడుతున్నాయి. బతిమిలాడించుకోవటమే కానీ బతిమిలాడటం తెలియని ఆమె తన కన్నీళ్లతో అతని పాదాలు కడుగుతూ తన హృదయాన్ని ప్రక్షాళన చేసుకుంటోంది.

ఆయన వాత్సల్యపూర్వకంగా ఆమెవైపు చూశాడు.

'అలాగే కానీ' అన్నాడు.

ఆమె అశ్రుకణాలలో ఆనంద భానుడు తళుక్కుమన్నాడు.

అయితే, అంతవరకూ మౌనంగా చూస్తున్న ఆయన శిష్యులలో నిరసన ఒక వీచికలా కదలాడింది.

'ఈమె ఎవరో తెలుసునా?' ఓ శిష్యుడు అడిగాడు.

'ఈమె వేశ్య. నగర వధువు అంటారు' మరో శిష్యుడు చెప్పాడు వ్యంగ్యంగా.

'అంటే నగరంలో ఉన్న పురుషులందరికీ వధువు' మరొకరు సమాధానం ఇచ్చారు.

'అంటే నిత్య వధువు' ప్రతి రాత్రి వసంతరాత్రి. ప్రతిరోజూ కొత్త మొగుడు' ఇంకా ఎవరో మరింత కసిగా అన్నారు.

'చాలా ధనవంతురాలు. ఎవరు బడితే వారు కన్నెత్తిచూడలేరు. ఆమె కోరిన ధనం చెల్లిస్తేనే ఆమె పొందు లభిస్తుంది' అన్నారింకెవరో.

'ఈమె పాపి. శత్రురాజు బింబిసారుడిని ప్రేమించింది. మారువేషంలో అతడు ఈమె ఇంట్లో ఆశ్రయం పొందాడు. మా వైశాలి వీరుల కండలు, కరకు కత్తులను తుత్తునియలు చేయగల శక్తిమంతమైన గుండెలు చూసి బెదిరి పారిపోయాడు. లేకపోతే ఈమె గృహం దేశద్రోహానికి కేంద్రం అయ్యేది' ఇంకెవరో అన్నారు.

ఒక్కొక్కరి మాట ఇక్కొక్క శరాఘాతంలా తగులుతూంటే ఆమె విలవిలలాడిపోతోంది. తన ప్రమేయం లేకుండా తన జీవితంలో జరిగిన పలు సంఘటనల ఆధారంగా తన జీవితాన్ని, తన వ్యక్తిత్వాన్ని, తనను వారు దూషిస్తూంటే, ఇందులో తన తప్పు ఏముందో? ఏ రకంగా తాను తన జీవితంలో జరిగిన సంఘటనలకు బాధ్యురాలో తెలియక ఆమె విలపించింది.

ఏరకంగా తన కంటిన ఈ మచ్చను తొలగించుకోవాలో తెలియక దుఃఖించటం ఆరంభించింది.

తను అనాథ బాల. మామిడివనంలో దొరకటంలో తన ప్రమేయం లేదు. ఆమ్రపాలి అన్న నామకరణంలోనూ తన ప్రమేయంలేదు.

ఎదుగుతున్న కొద్దీ అత్యంత సౌందర్యవతిగా రూపొందటంలోనూ తన ప్రమేయంలేదు. తన సౌందర్యం చూసి, తనని వివాహం ద్వారా తమ స్వంతం చేసుకోవాలని రాజ్యంలో ప్రతి ఒక్కరూ పోటీపడటంలోనూ తన ప్రమేయంలేదు.

తనని పొందటంకోసం పెద్దల నడుమ హింసాత్మకమయిన పోరు సాగటంలోనూ తన ప్రమేయంలేదు.

కానీ అన్నిటికీ అందరూ తననే దోషిగా నిలబెడుతున్నారు.

ఆమ్రపాలి మనసు మౌనంగా ఆక్రోశిస్తోంది.

అందరూ తన అందాన్ని పొగిడి, తన చుట్టూ తిరుగుతూ, తనని పొందటంకోసం తినుబండారం కోసం తన్నుకులాడే నీచజంతువుల కన్నా హీనంగా ప్రవర్తిస్తూంటే ఆమ్రపాలికి ఆశ్చర్యంగా ఉండేది. గర్వంగా ఉండేది. అసహ్యంగా ఉండేది.

ఈ ఆరాటం, పోరాటం ఎందుకోసమో అర్థమయ్యేదికాదు. ఏం సాధించాలని వీళ్లంతా ఇంతగా ఆత్రపడిపోతున్నారు, ఇంతగా పశువులయిపోతున్నారో ఆమెకు బోధపడేదికాదు.

చివరికి ఒకరోజు వైశాలి రాజు నుంచి కబురు వచ్చింది. 'నీ అసమాన సౌందర్యం రాజ్యంలో అందరినీ విచక్షణ విహీనులను చేస్తోంది. నీవల్ల దేశంలో శాంతిభద్రతలు దెబ్బతిని, అంతర్గతంగా అల్లకల్లోలమై, దేశం బలహీనమయ్యే పరిస్థితి వస్తోంది. నువ్వు ఏ ఒక్కరికి చెందినా మిగతా వారంతా తిరగబడేట్టు ఉన్నారు. అందుకని నిన్ను 'నగర వధువు'గా నిర్ణయించాను. నీ నృత్యం, నీ సౌందర్యం, నీ కళ, నీ మనస్సు, సర్వం నగరానిదే. నగరంలో ఎవరైనా నీవు నిర్ణయించిన సొమ్ము చెల్లిస్తే నిన్ను పొందవచ్చు'.

రాజు ఆ నిర్ణయానికి రావటంలో తన ప్రమేయం లేదు.

'అంటే నన్ను వ్యభిచారిణి కమ్మంటున్నారా?' అడిగింది ఆమ్రపాలి.

రాజు ముఖంలో బాధ స్పష్టంగా కనిపించింది.

'నిన్ను దేశ భద్రత కోసం త్యాగం చెయ్యమంటున్నాను. దానికి నువ్వు ఏంపేరు పెట్టుకొన్నా ఫరవాలేదు' కాస్సేపటి మౌనం తరువాత రాజు అన్నాడు.

'నీది లోకోత్తర సౌందర్యం. పంచభక్ష్య పరమాన్నాలతో వడ్డించిన విస్తరిని విచక్షణలేని జంతువుల నడుమ వదిలితే ఎలా ఉంటుంది? దీన్లో నీదోషం లేదు. దేవకన్యను మెదడు, నియంత్రణలేని రాక్షసుల నడుమ వదిలినప్పుడు, కొన్ని అసాధారణమైన నిర్ణయాలు తీసుకోక తప్పదు. ఇది అలాంటిదే'

ఆమ్రపాలి మౌనంగా రాజు, నిర్ణయానికి తలవంచింది. ఆమె మనసులోని మాటను, ఆమె ఇష్టాఇష్టాలను ఎవ్వరూ అడుగలేదు. ఆమె చెప్పలేదు.

కానీ ఆమె నృత్యంలోని ఆకర్షణ తీవ్రత పెరిగింది. అలాగే ఆమె తనను కలవాలనుకుంటే వారికి విధించే నియమాల కాఠిన్యం పెరిగింది.

'ఇందులో తన దోషం ఏముంది?' ఆలోచిస్తోంది ఆమ్రపాలి మనస్సు. రాజును నిరాకరిస్తే ఒక సమస్య. ఆమోదిస్తే మరో సమస్య. ఎలా చేసినా దోషం తనదే అంటారు.

అంతలో ఆమె మనస్సులో మరో దృశ్యం మెదిలింది.

ఒక యువకుడు ఆమె జీవితంలో ప్రవేశించాడు. ఆమె హృదయంలో అడుగుపెట్టాడు. ఆమెలో ప్రథమంగా ప్రేమభావన జనించింది. అన్నాళ్లూ అందరూ ఆమెకు దాసులవటం తెలిసిన ఆమెకు తొలిసారిగా తాను మరొకరికి దాసిగా భావించటంలోని మాధుర్యం అనుభవానికి వచ్చింది. ఆమె జీవితంలో అత్యద్భుతమైన కాలం అది. ప్రపంచమంతా ప్రేమమయం. ఎటుచూసినా ఆనంద ప్రవాహాలే. ఎటు పరికించినా ప్రేమామృత జల్లులే.

కానీ తన హృదయాన్ని దోచిన ఆ యువకుడు తమ శత్రురాజు బింబిసారుడని, అతడు మారువేషంలో ఉన్నాడని తనకి తెలియదు.

మారువేషంలో తన హృదయాన్ని దోచుకున్నది బింబిసారుడు.

కానీ ప్రజలు శత్రువును ప్రేమించి, ఆశ్రయం ఇచ్చిన దోషం తనకి అంటగట్టారు. ఇందులో తన దోషం ఏముంది?

ఆమ్రపాలి కళ్లల్లో నీళ్లు నిండాయి.

తనను హింసిస్తున్న వైశాలి ప్రజలను మట్టుపెట్టటానికి బింబిసారుడు యుద్ధానికి సిద్ధమయ్యాడు. అతడి ధాటికి వైశాలి నాశనం అయ్యేది.

తనమీద ఏమాత్రం ప్రేమ ఉన్నా, 'యుద్ధం వద్ద'న్న ఆమ్రపాలి కోరికను మన్నించాడు బింబిసారుడు. పిరికివాడని, ఆమ్రపాలి వీరుడిని కాదు పిరికివాడిని ప్రేమించిందనీ ప్రజలు తనను, తన ప్రియుడిని హేళన చేయటంలో తన దోషం ఏముంది?

ఆ హేళనను పట్టించుకుని ఆయన తనయుడు అజాతశత్రు పెద్ద సైన్యం తీసుకువచ్చి వైశాలిని ధ్వంసం చేయటంలో తన దోషం ఏముంది? అంతలో ఏదో గుర్తుకు వచ్చి ఆమె మనసు రోదించింది తీవ్రంగా. తనను ప్రజల నిర్బంధం నుంచి విడిపించిన అజాతశత్రు తనని చూసి మోహించటంలో తనదోషం ఉందా?

అతడిని తిరస్కరించటం తన తప్పా?

ఎక్కడుంది తన దోషం? తన ప్రమేయం లేకుండా జరుగుతున్న ఈ సంఘటనలో ఏది తన పొరపాటు? ఆమె మనసు ఆక్రోశిస్తోంది.

కన్నీళ్లతో అతని పాదాలను కడిగి మనసును ప్రక్షాళన చేసుకున్న ఆమె అతడి శిష్యుల, ప్రజల దూషణలు, వారు తెలియచేస్తున్న ఘోరమైన దోషాలు విని మనసు మార్చుకుంటాడేమోననుకుంటూ అతడివైపు చూసింది. కన్నీళ్ల నడుమ దేదీప్యమానంగా వెలుగుతున్న కరుణకాంతి పుంజంలా కనిపించాడతడు.

దయా సింధువులా, ప్రేమకు ప్రతిరూపంలా తోచాడతడు.

'ఈ ప్రపంచంలో దుఃఖానికి మూలం కోరిక. ఎదుటి వ్యక్తి కోరిక కూడా మరో వ్యక్తి దుఃఖానికి కారణం అవుతుంది. అందుకని కోరికను త్యజించాలి. దుఃఖం అదృశ్యమవుతుంది. ప్రేమించాలన్నది కోరిక. ప్రేమ పొందాలన్నది కోరిక. ప్రజల మెప్పు పొందాలన్నది కోరిక. అందరి ఆమోదం పొందాలన్నది కోరిక. కోరిక ఏదైనా ఎలాంటిదైనా అది దుఃఖ కారణం అవుతుంది. కాబట్టి కోరిక అన్నదాన్ని సంపూర్ణంగా త్యజించాలి. కోరికను నశింపచేయాలి. అప్పుడు ఇక ప్రపంచంలో దుఃఖం అన్నదే ఉండదు.'.

అమృత బిందువులు ఎండి మోడువారిని ఎడారి భూమిలో వర్షించినట్టు ఆమె హృదయంలో అతని పలుకులు మార్మోగాయి.

అమృతం తాకగానే జీవం పోసుకుని మోడయిన వృక్షం చిగురించి నట్టు ఒక్కసారిగా ఆమె హృదయం చైతన్యవంతమయింది.

ఎవరి ఆమోదమో పొందాలన్న ఆలోచన ఆవిరైపోయింది. ఎవరి మెప్పో పొందాలన్న కోరిక నశించిపోయింది. తాను ఆనంద స్వరూపం. తాను ఎవరికీ జవాబుదారి కాదు. తాను శుద్ధ చైతన్యం. ఆనంద స్వరూపం

'ప్రపంచం ప్రేమ అనుకుంటున్నది కోరిక. అది దుఃఖ కారణం. అసలు ప్రేమ ఇదే. కోరికను నశింపజేసుకోవటంవల్ల కలిగే శాశ్వతము, సంపూర్ణము అయిన భావన అసలు ప్రేమ.

ఆమె ముఖంలో జ్ఞాన వెలుగులు వెలిగాయి. ఆమె మరింత అందంగా కనిపించింది. ఆమె సౌందర్యం ఇనుమడించింది. అయితే ఇప్పుడు ఆమ్రపాలి సౌందర్యం వ్యక్తులలో కోరిక కలిగించటం లేదు. వ్యక్తుల కోరికలను నశింపజేసి, వారి మనస్సులను ప్రశాంత సాగరాలుగా మారుస్తోంది.

ఆమ్రపాలి గౌతమబుద్ధుడి ముందు మోకరిల్లింది.

ఆమె బౌద్ధ సన్యాసిని అయింది. 'అరహంత్'గా ఎదిగింది.

****

'ఆమ్రపాలి' కథ చారిత్రక గాథలలోనూ, బౌద్ధ గ్రంథాలలో, జాతక కథలలోనూ ఉంది. భిన్నరూపాలలో ఉన్న ఆమ్రపాలి గాథకు కథారూపం ఈ ప్రేమ గాథ.

రంగులు వేయండి



పిల్లలూ! పై చిత్రంలో పక్కన ఇచ్చిన సూచనల ఆధారంగా ఆయా అంకెలున్నచోట ఆయా రంగులు వేయండి.

దారి చూపుతారా

స్వేచ్ఛ

కథ

లలిత ఓ పంచవన్నెల చిలుకను పంజరంలో ఉంచి, అపురూపంగా చూసుకుంటోంది. తీరిక దొరికినప్పుడు చిలుకకు ముద్దు ముద్దుగా మాటలు నేర్పిస్తూ ఉంటుంది. ఆమె శిక్షణలో చిలుకకు కొన్ని మాటలు పట్టుబడ్డాయి. ఎవరైనా కొత్త వారు ఇంటికివస్తే వెంటనే 'రండి కూర్చోండి, బాగున్నారా!' అంటూ పలుకరిస్తుంది.

లలిత, చిలుకకు రోజు జామ పండ్లు పెడుతుంది. ఒకరోజున ఎక్కడి నుంచో ఒక గోరువంక ఆ యింటికి వచ్చి, ముందున్న బాదం చెట్టుమీద నివాసం ఏర్పరచుకుంది. గోరువంక, చిలుక పంజరంమీద వాలింది. వెంటనే చిలుక 'రండి, కూర్చోండి, బాగున్నారా' అంది.

గోరువంక కువకువలాడింది, రెప్పలు వాల్చకుండా చిలుకని చూసి మెచ్చుకుంది. 'ఎంత అందంగా ఉన్నావు' అంది. రామచిలుక పొంగిపోయింది.

ఇద్దరూ తరచుగా కలుసుకుంటున్నారు. లలిత రాగానే గోరువంక ఎగిరిపోయేది. లలిత గోరువంక కోసంకూడా కొన్ని గింజలు నేలమీద చల్లేది. అది ఆ గింజలను తిని ఎగిరిపోయేది.

ఒకరోజు గోరువంక చిలుకను 'నాతో జతకడతావా?' అడిగింది.

చిలుక సంతోషంగా ఒప్పుకుంది. కాని పంజరం అడ్డు ఉంది. దాంతో ఇద్దరూ బాధపడుతున్నారు.

'నన్ను పంజరంలోంచి వదిలిపెట్టవా, గోరువంక దగ్గరకు వెళ్లాలి' చిలుక అడిగింది లలితని.

'అమ్మో! నిన్ను వదిలిపెడితే ఇంకేమన్నా ఉందా! పారిపోవూ, పోనీ, గోరువంకనే నీ పంజరంలోకి వచ్చి ఉండమను' సలహా ఇచ్చింది లలిత.

చిలుక, గోరువంక రాగానే తన కోసం పంజరంలోకి రమ్మని ఆహ్వానించింది. గోరువంక నిరాకరించింది. 'చిలుకా పంజరంలో ఉండి నువ్వు ఎంతో స్వేచ్ఛను పోగొట్టుకున్నావు. నన్ను కూడా పంజరంలోకి రమ్మంటున్నావు. తెలివిగల వాళ్లు ఎవరూ స్వేచ్ఛను పోగొట్టుకోరు' అంది.

'అయితే మనం కలుసుకునేదెలా?' చిలుక విచారించింది.

గోరువంక బాగా ఆలోచించి ఒక ఉపాయం చెప్పింది.

ఒకరోజు లలిత చిలుకకు జామ పండు పెడదామని వచ్చే సరికి చిలుక రెక్కలు చాపుకుని కళ్లుతేలేసి వెల్లకిలా పడుంది.

'చిలుకా! చిలుకా! పలుకు! నీకేమయింది' లలిత ఎన్నిసార్లు పిలిచినా బదులులేదు.

లలితకు ఏడుపు వచ్చింది. తన పెంపుడు చిలుక చచ్చిపోయినందుకు బాధపడి, ఇక దాన్ని పంజరంలో ఎందుకు ఉంచటమని బయటకు తీసి పడేసింది.

గోరువంక ఎక్కడినుంచో వచ్చి గోలగోలగా ఎగురసాగింది. అంతే. చిలుక చివాల్న లేచి లలిత చూసేలోపే పైకి ఎగిరింది.

'అయ్యో! చిలుకా, నా దగ్గరికి రా, నీకు జామపళ్లు ఇస్తాను' అంటూ బతిమిలాడింది.

'స్వేచ్ఛగా ఆహారం సంపాదించుకుంటే నాకు ఉండే తృప్తి నువ్వు పంజరంలో ఉంచి ఇచ్చే పళ్లలో లేదు. ఇన్నాళ్లు నేనేం కోల్పోయానో మా గోరు వంక బావ చెపితే తెలిసింది. వస్తా' అంటూ ఎగిరిపోయింది.

-వియోగి

మెచ్చగలరు

మెచ్చు మెచ్చు మెచ్చు
జగమంత మెచ్చు
బడికి సరిగ వెళ్లి
పాఠాలు చదివి
పరీక్షలు రాసి
ఫస్టు మార్కులు
తెచ్చుకుంటే
అమ్మ, నాన్న మెచ్చు
ఆనందమొందు

ఆటలోన మేటివైతే
పాటలో ముందుంటే
ముద్దు ముద్దు పదాలు
ముత్యాలుగ రాస్తుంటే
తోటివారు మెచ్చి
బహుమతులు వచ్చు

మొక్కలు నాటితె
చక్కగ పెంచితె
చుట్టు కంచె వేసితె
పదిమందికి చెపితే
ప్రభుత్వం మెచ్చు
బహుమతి నీకు ఇచ్చు

అమ్మ,నాన్న మాట
గురువుగారి మాట
పెద్దల మాట
విన్నవారినెపుడు
విశ్వమెల్ల మెచ్చు!

-సామలేటి లింగమూర్తి
సిద్ధిపేట.

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

జి.పరమేశ్, వరంగల్.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. లావా ఎందువలన అత్యంత వేడిగా ఉంటుంది? దయచేసి వివరించండి.

జవాబు: పరమేశ్! మనం భూమిలోకి నిట్టనిలువుగా 48మీటర్లు తవ్వితే అక్కడ ఉష్ణోగ్రత ఎంత ఉంటుందో తెలుసా? 1200 డిగ్రీల సెంటీగ్రేడ్. దానికి ఇంకా కింద అయిన భూకేంద్రం వద్ద ఉష్ణోగ్రత 5,500 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంటుంది. అటువంటి మహా ఉష్ణోగ్రత వద్ద పాషాణం కరిగి ద్రవరూపంలో ఉంటుంది. ఆవిరి, వాయువుతో సమ్మిళితమై ఉండే ఈ ద్రవ పాషాణం భూమిలోపల నుంచి మహాశక్తితో బయటకు ఎగజిమ్ముతుంది. భూకేంద్రం నుంచి మొదలయ్యే ఈ లావా భూ ఉపరితలంలోగల పగుళ్లలోంచి బయటకు వెలువడుతుంది. ఒక్కోసారి ఈ పగులు గుండ్రని కన్నమే కావచ్చు. ఈ లావా బయటకొచ్చినప్పుడు అది పాషాణం మీదే ప్రవహించి ఘనీభవించటం వల్ల ఆ పాషాణపు ఎత్తు పెరుగుతుంది. ఇదే అనేకసార్లు జరిగి పొర మీద పొర పేరుకోవడం వల్ల పర్వతాలు ఏర్పడతాయి. పైకి ఎగజిమ్మే లావా భూమిమీద ప్రవహించినపుడు దాని దారిలో ఉన్న ప్రతిదీ నాశనమవుతుంది. దీనికి కారణం ఆ బరువైన ద్రవం 1090 నుంచి 1640 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత కలిగి వుండడమే. అంతేకాదు ఆ లావా ప్రవాహానికి దరిదాపులలో గల గ్రామాలూ, నగరాలు కూడా నాశనమవుతాయి. ఒకసారి లావా ఉప్పొంగిన తర్వాత తిరిగి లావా ఉప్పొంగేందుకు చాలాకాలం పట్టవచ్చు. ఆ కారణంగా ఆ దరిదాపుల్లో నివసించే ప్రజలలో తమకు ఇక ఎటువంటి ప్రమాదం సంభవించదనే ధీమా ఏర్పడవచ్చు. కానీ హటాత్తుగా లావా తిరిగి పొంగవచ్చు. ప్రాచీనకాలంలో రోమన్ నగరమైన పాంపేలో ఇదే జరిగింది. మౌంట్ వెసూవియన్ అనే పర్వతం నుంచి వెలువడిన లావా ఆ నగరాన్ని పూర్తిగా కప్పటంతో ఆ నగరం నాశనమైపోయింది.

కె.శ్రావ్య,విజయవాడ.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఏడో తరగతి చదువుతున్నాను. హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శిఖరాలు ఏకాలంలో ఏర్పడ్డాయి? దయచేసి చెప్పండి.

జవాబు: శ్రావ్యా! హిమాలయాల్లోని పర్వతాలు సుమారుగా 60 మిలియన్ సంవత్సరాల కిందట ఆవిర్భవించడం మొదలుపెట్టాయి. హిమాలయాలలోని అత్యంత ఎత్తయిన పర్వత శిఖరాలతో కూడిన గ్రేటర్ హిమాలయాలు మాత్రం 20-25 మిలియన్ సంవత్సరాల కిందటే ఆవిర్భవించాయి. ఈనాటికీ ఎంతో కొంత కొద్దిస్థాయిలోనైనా హిమాలయాలలోని పర్వతాల సంఖ్య పెరుగుతూనే వుందని చెప్పాలి.



కొత్తపుంతలు తొక్కిన బాలల కథలు!

బాలల కథలు అనగానే వారికి నీతి అందించేవిగా ఉండాలనో, సరదాగా ఉండాలనో, మాయలు, మంత్రాల అద్భుత ప్రపంచ ఆవిష్కరణతో బాలల్ని ఆశ్చర్యానందాలకు గురించేసి, ఊహాలోకంలో విహరింపజేసేవిగా ఉండాలనో అనుకోవటం పరిపాటి. అంతేకాదు నిజజీవితంలోని చాలా విషయాలను లేత మనసులకు తెలియకుండా ఉంచాలనే తాపత్రయపడుతుంటారు పెద్దవాళ్లు. సమాజంలోని కుళ్లును, జీవితంలో ఎదురయ్యే అనేకానేక కష్టాలను, దుఃఖాన్ని పరిచయం చేయడానికి పెద్దలు ఇష్టపడరు. అలా అని ఆ విషయాలు వారికి తెలియకుండా ఉంటాయా అంటే అదేంకాదు, ఏదో ఒకరోజు వారికి తెలిసిపోతాయి. హఠాత్తుగా ఎదురయ్యే ఆ పరిస్థితులను, సమస్యలను ఆకళింపు చేసుకోవటం, తగ్గట్టుగా వ్యవహరించడం అప్పుడు వారికి కష్టమవుతుంది. అందువల్ల వారికి ముందుగానే అర్థమయ్యే రీతిలో వాటిని వివరించడం వల్ల అవగాహన ఏర్పడుతుంది. ఆ తర్వాత కాలంలో వాటి గురించి తెలిసినప్పుడు వారు ధైర్యంగా, వివేకంతో నడుచుకోగలుగుతారు. ఈ ఉద్దేశంతోనే సురేష్ ఈడిగ కొత్తరీతిలో ' 'నువ్వా, నేనూ.. ఓ కథ- పిల్లల్ని నిద్రపుచ్చే సమయంలో ఆశువుగా చెప్పగల సాంఘిక కథలు' పేరిట ఓ పుస్తకాన్ని ప్రచురించారు. ఈకథలన్నీ రచయిత తమ పిల్లలకు ఆశువుగా చెప్పినవే. ఈ పుస్తకంలో 11 కథలున్నాయి. సాంఘిక కథలని పేర్కొన్నారు కాబట్టి అవి సమాజ స్వరూపానికి సంబంధించిన కథలన్ని అర్థం చేసుకోవచ్చు.

ఇందులో తొలి కథ 'భోపాల్ గ్యాస్ అనే పెద్ద విషాదం'. కథా ప్రారంభమే గోపీ అనే అబ్బాయికి నిద్రపట్టకపోతే వాళ్లమ్మ ఆకాశం లోని చుక్కల్ని చూపుతూ ట్వింకిల్..ట్వింకిల్ లిటిల్ స్టార్' అంటూ పాడిందంటూ మొదలవుతుంది. ఇలా కొన్ని రైమ్స్ పాడటం అయ్యాక గోపీతో సహా ఇంట్లో అంతా పడుకుంటారని.. కానీ పొద్దున్నే ఎవరూ లేవలేదని చెపుతాడు కథకుడు. ఆ తర్వాత కారణం చెపుతూ భోపాల్ గ్యాస్ సంఘటనను వివరిస్తాడు. ఆ పిల్లలెవరూ మళ్లీ నక్షత్రాలను చూడలేదని, స్కూలు బస్సు ఎక్కలేదని చెపుతూ వారి మరణాన్ని కదిలించే రీతిలో చెపుతారు. కొంతమంది పిల్లలు బతికినా జబ్బులపాలయ్యారని, వారికి జీవితకాల వైద్యం అవసరమైందని, అందుకు ఎంతోమంది ఆర్థికసహాయం అందించారని, అలా అంతా సహాయపడవచ్చని సూచిస్తాడు. రెండో కథ పర్యావరణానికి సంబంధించింది. ఈ కథ పేరు 'మీరు పిల్లలైనా గొంతెత్తి మాట్లాడవచ్చు'. డంపింగ్ యార్డ్‌లో పడేయాల్సిన చెత్తను ఊళ్లో అందరూ వాడుకునే చోట పడేయడం గురించిన కథ ఇది. ఈ కథ ద్వారా అన్యాయం జరిగినపుడు ప్రశ్నించి, న్యాయం కోసం పోరాడలని, పిల్లలు సైతం గొంతెత్తి నిలదీయవచ్చని చెపుతారు రచయిత.

అలాగే 'మత్తుమందులు, సిగరెట్లు అండ్ ఆల్కహాల్ లో పిల్లల సునిశిత పరిశీలనాదృష్టితోపాటు దురలవాట్ల ఫలితాల గురించి వారికి తెలియజెపుతారు. ఓటు గురించి, కులం గురించి కూడా చక్కని కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. 'చేనేత మాంత్రికుడు' కథలో నేతపని చేసే తల్లి శ్రమను తగ్గించడం కోసం మల్లేశం అనే బాలుడు ఆరేళ్ల శ్రమపడి ఒక యంత్రాన్ని తయారుచేయడం .. తల్లితోపాటు నేతపని వారందరికీ అదెంతో మేలు చేయడం.. రాష్ట్రపతి నుంచి గుర్తింపు పొందడం.. స్ఫూర్తిదాయక బాలుడి కథ నిజంగా పిల్లలందరూ చదివితీరాల్సిందే.

'వేగం రేస్ ట్రాక్‌కి మాత్రమే పరిమితం' కథలో మిక్ క్వీన్ వేగంగా వాహనం నడపడంతో భయపడిపరుగెత్తిన పప్పీ పొదలో చిక్కుకోవటం, దాని కాలికి గాయం కావడం ..మిక్ క్వీన్ పశ్చాత్తాపంతో మరెప్పుడు వేగంగా డ్రైవ్ చేయకూడదని నిర్ణయించుకోవడం..ఎంతో బాగుంది. పాఠాలను కూడా కథలాగా చెపితే ఎంత త్వరగా అర్థమవుతుందో 'ఖండాల గురించి తెలుసుకుందామా..' లో తెలుస్తుంది. కొత్త వస్తువులు కనుగొనటం గురించిన, అలెప్పో యాత్ర గురించిన కథలు బాలలకు నచ్చేలా ఉన్నాయి. కథలకు తమ పాప వేసిన బొమ్మలనే వాడటం ఇంకా బాగుంది. మూస పద్ధతి కథలకు భిన్నంగా కథలను చెప్పి, బాలల కథలకు కొత్తవాకిళ్లు తెరిచిన సురేష్ ఈడిగ అభినందనీయుడు. వందరూపాయల వెల గల ఈ పుస్తకం కోసం కినిగె .కామ్‌ను సంప్రదించవచ్చు.

-జె. శ్యామల

జోక్స్ కార్నర్

హోటల్లో డిన్నర్ చేస్తున్న కస్టమర్.. వెయిటర్! ఏంటీ ఘోరం..సూప్‌లో గుండీ వచ్చిందేమిటి?

వెయిటర్: క్షమించండి సార్. అది నా కోటుకు కుట్టుకుందామనుకున్న గుండీనే. దాని కోసం ఎంత వెదికానో.

కస్టమర్: సరేగానీ నువ్వు చేస్తున్న పనేమిటి? సూప్‌లో ఏముందని అలా కెలుకుతున్నావు? బటన్ నా చేతిలోనే ఉందిగా.

వెయిటర్: నేను సూదీ దారం కోసం వెతుకుతున్నా సార్..అవి కూడా కనపడలేదు!!

ఓ ఖైదీ జైలునుంచి విడుదలయ్యే సందర్భం..

జైలర్, ఖైదీతో: జైలునుంచి విడుదల కాగానే నువ్వేం చేద్దామనుకొంటున్నావు?

ఖైదీ: టార్చిలైట్ కొంటానండీ.

జైలర్: టార్చ్ ఎందుకోయ్?

ఖైదీ: అది లేకపోవడం వల్లనే కదా ఇక్కడ కొచ్చింది. అదుంటే చీకట్లో నా కాలు నిద్రపోతున్న కాపలాదారు మీద పడేదే కాదు..

మోహన్ ఓరోజు కొత్తగా కాపరానికి వచ్చిన తన భార్యతో సామాన్లు కొనడానికి బజారుకు వెళ్లాడు. ఆ తర్వాత కూరల మార్కెట్‌కు కూడా వెళ్లి కూరలు కొన్నారు.

అప్పుడు పరిచయం ఉన్న కూరల దుకాణదారు 'బాబుగారూ! అమ్మగారు బాగా చదువుకున్నోర్లల్లే ఉంది' అన్నాడు.

'ఔను. ఎం.ఎ.పాసయ్యింది..గర్వంగా చెప్పి, కానీ అది నీకెలా తెలిసింది' అడిగాడు.

'సంచీఅడుగున టమాటాలు వేయించు కుని వాటి మీద గుమ్మడికాయ పెట్టారు' చెప్పాడు.

ఓ పండితుడు పడవలో ప్రయాణిస్తున్నాడు..

పండితుడు: నువ్వు తర్కశాస్త్రం చదివావా?'

సరంగు: లేదు బాబుగారూ.

పండితుడు: అయితే నీ జీవితం 25 శాతం వృధాయే.

పండితుడు: నీకు మీమాంస శాస్త్రం తెలుసా?

సరంగు: తెలీదండీ పంతులుగారూ

పండితుడు: అయితే నీజీవితం 50శాతం వృధా.

పండితుడు: నీకు జ్యోతిషశాస్త్రం వచ్చా?

సరంగు: రాదండీ.

పండితుడు: అయితే నీజీవితం 75శాతం వృధా.

కొద్దిసేపటికి గాలివాన మొదలై..తీవ్రమైంది.

సరంగు: అయ్యా మీకు ఈత వచ్చా?

పండితుడు: రాదు నాయనా

సరంగు: అయితే మీ జీవితం నూటికి నూరుపాళ్లు వృధా, పడవ మునుగుతోంది. నేను ఈదుకుంటూ ఒడ్డుచేరుతా.. నదిలోకి దూకేశాడు.

లోకం లోగిలిలో...

మొసలిని పెళ్లి చేసుకున్న మేయర్

మన ముందటి తరాలవారు కప్పలకు పెళ్లి చేస్తే వానలు పడతాయని నమ్మేవారు. ఇప్పటికీ గ్రామాలలో ఇలాటివి ఆచరించేవారు లేకపోలేదు. అయితే మెక్సికో వారికి కూడా ఇలాటి నమ్మకాలున్నాయి. మొసలిని పెళ్లిచేసుకుంటే స్థానిక జాలరులకు అదృష్టం చేకూరుతుందని వారు విశ్వసిస్తారు. అయితే ఈ ఆధునిక కాలంలో కూడా మెక్సికోలో ఈ తంతు జరిగింది. ముందుగా ఆ ఆడమొసలిని బాప్టైజ్ చేసి, ఆ తర్వాత సంప్రదాయ వివాహ దుస్తులు కట్టబెట్టారు. అయితే పెళ్లిరోజున దాని పళ్లు కదలకుండా కట్టిపడేసి జాగ్రత్తపడ్డారు. దానికి ఓ

పెళ్లికూతురిలా మేలిముసుగు వేసి, బ్యాండుమేళం పెట్టి వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత స్థానిక మేయర్ శాన్ పెడ్రో హమెలులా విక్టర్ లగిలరండ్ ఆ మొసలిని టౌన్ హాల్లో శాస్త్రోక్తంగా వివాహం చేసుకున్నాడు. ఆ మొసలిని రాణిగా వారు భావిస్తారు. ఆమె తమ కమ్యూనిటీకి శాంతిసౌభాగ్యాలనిస్తుందని నమ్ముతారు. వివాహ సందర్భంలో డ్యాన్స్ కూడా చేస్తారు. ఆ డ్యాన్స్ దైవానికి కృతజ్ఞతలు తెలియజేసేదిగా ఉంటుంది. ఏమయితేనేం..తాజాగా మేయర్‌గారికి మొసలి రాణితో పెళ్లయిందన్నమాట.

నిప్పుతో చెలగాటం

రష్యాలోని కెమెరోవో నగరంలో ఓ ఫెస్టివల్‌లో ' 'ఫైర్ బ్రీతర్' సాహసాన్ని ప్రదర్శించడంలో తన ముఖాన్నే మంటలకు గురిచేసుకున్నాడు. బాధతో నేలమీద పడిపోయాడు.

అతడు రోజూలాగే ఆ సాహసాన్ని ప్రదర్శించాలనుకున్నాడు కానీ ప్రమాదం అతణ్ని వెంటాడింది. ఆ సాహసాన్ని తిలకిస్తున్న జనంలో కొందరు మందపాటి రగ్గులను విసిరి మంటలనార్పే ప్రయత్నం చేశారు. ఓ మహిళ బాటిల్ నీళ్లు పోసింది. ఆతర్వాత అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అంతకుముందు ఇటువంటి సాహసం ప్రదర్శిస్తూనే ఇద్దరు ప్రమాదం పాలవబోయి, త్రుటిలో తప్పించుకున్నారట. ఏమైనా ఫైర్‌బ్రీతింగ్ అనేది ప్రమాదకరమైన కళ. ఏమాత్రం పొరపాటు దొర్లినా అంతే సంగతులు.

మొక్కలు నాటిన యుఎస్ 'మొగ్గ'

భారత్‌లో మొక్కలు నాటడానికి ఏడేళ్ల ఇషా అనే బాలిక న్యూజెర్సీ నుంచి ఇండియాకు వచ్చింది. ఇషాకు ఇటీవల కాలంలోనే భూతాపం (గ్లోబల్ వార్మింగ్) గురించి, దాన్ని ఎదుర్కోవటంలో చెట్ల ప్రాముఖ్యత గురించి తెలిసిందట. అదే సమయంలో ఇషా తండ్రి పుట్టినరోజు రావడంతో ఆ ప్రత్యేకమైన రోజును ఏరకంగా సెలబ్రేట్ చేద్దామని అడిగితే ఆయన ఆ చిన్నారికే ఆ విషయాన్ని వదిలివేశారు. తమ టీచర్ చెట్ల ప్రాముఖ్యత గురించి చెప్పిన పాఠమంతా గుర్తువచ్చి ఆరోజున చెట్లునాటితే బాగుంటుందని ఇషా తెలిపింది. ఇన్నేళ్లపాటు ఆ పనిని విస్మరించినందుకు వారు ఆ సంవత్సరాలన్నీ కూడా లెక్క కట్టి మొత్తం 750 చెట్లు నాటాలని నిర్ణయించారు. ఇంతలో వారి తాత నానమ్మల 50వ పుట్టినరోజు వేడుకలకు వారు ఇండియా రావలసి వచ్చింది.

గ్రీన్ డ్రైవ్‌ను చేపట్టిన గాయకుడు దలేర్ మహెందిని సంప్రదించి తమ మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయనను ఆహ్వానించారు. దాంతో ఆ కార్యక్రమానికి 'ఇషా దలేర్ ఆక్సిజెనేట్ డ్రైవ్' (ఐడిఓ) అని పేరు పెట్టారు. ఇంత చిన్న వయసులో ఇషాకు వచ్చిన మంచి ఆలోచన ఎంతైనా మెచ్చదగ్గది. ఆమె మొగ్గలందరికే కాదు, పెద్దలందరికీ కూడా గొప్ప స్ఫూర్తినిచ్చిందని చెప్పాలి. టీచర్ చెప్పిన పాఠాన్ని వినటమేకాదు, దాన్ని ఆచరణలో పెట్టేందుకు కృషి చేయడం గొప్పవిషయం కదూ. 'మొగ్గ' దశలోనే మొక్కల ప్రాముఖ్యతను అర్థం చేసుకున్న ఇషా నిజంగా అభినందనీయురాలు.

కథ

గడి విప్పని పట్టుచీర

ఏదో పనుందని హడావిడిగా బైటికి వెళ్లిన మధు గంటలోపే వచ్చేసి సరాసరి మేడమీది కెళ్తూ "నర్మదా! మంచినీళ్లు" అంటూ ఓ కేక పెట్టాడు.

కింద ఓ గదిలో కూర్చుని తల్లీ, ఒకరిద్దరు బంధువులతో ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుంటున్న మధు చెల్లెలు చందన మధు భార్య నర్మదకేసి చూసి–

"అదిగో! మీ హీరో వచ్చేశాడు, నీళ్లు కావాలట. మీ గదిలోని ఫ్రిజ్‌లోంచి తీసి తాగించు" అంది, ముసిముసిగా నవ్వుతూ.

భర్త పిలుపు విన్న నర్మద ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోయింది. చెంపలు కెంపులైపోయాయి. అయినా నవ వధువునన్న బెరుకు, పెద్దలు గేలి చేస్తారన్న సిగ్గు, ఆమె ఉత్సాహానికి ఆనకట్ట వేశాయి. భయం భయంగా అత్తగారైన అనసూయకేసి చూసింది.

"వెళ్లమ్మా! చందా అలాగే ఏడిపిస్తుంది. వెళ్లి వాడికి మంచినీళ్లిచ్చిరా" అందావిడ నవ్వుతూ.

అంతే! చిన్నపిల్లలా మెట్లకేసి పరిగెత్తింది నర్మద.

ముసిముసిగా నవ్వుకున్నారంతా.

మధు, నర్మదల పెళ్లయి పది రోజులయింది. ఇరువైపు మూడు నిద్రలూ వగైరాలు అయిపోగానే నర్మదని తీసుకొచ్చేసింది అనసూయ.

టెన్త్ క్లాస్ పరీక్ష రాసిన టీనేజర్ నర్మద. మంచి సంబంధం అని పెళ్లి జరిపించేశారు. తర్వాత కొన్నాళ్లు పిల్లని తమ దగ్గరే వుంచుకోవాలని ఆశించినా, అనసూయా వాళ్ల మంచితనం గురించి బాగా తెలిసిన నర్మద తల్లితండ్రులు ఆనందంగానే పంపారు. మధు పెళ్లికొచ్చిన బంధువులంతా వెళ్లిపోయారు. చెల్లెలు, ఒకరిద్దరు బంధువులు తప్ప.

పెళ్లికని తీసుకున్న సెలవు కూడా అయిపోవచ్చింది. అందుకే మధుకి మనసు మనసులో లేదు. ఇరవై నాలుగ్గంటలూ అందమైన భార్యని చూస్తూ గడిపెయ్యాలనుందతనికి.

నర్మద కూడా అతని దగ్గరున్నప్పుడు ఆనంద సాగరంలో తేలిపోయేది. కొత్త

– రావినూతల సువర్ణాకన్నన్

దంపతులు కదా! అని నవ్వుకున్నారు పెద్దలు.

నర్మద వెళ్లేలోగానే మరోసారి పిల్చాడు మధు. అంతవరకూ పరుగులాంటి నడకతో వచ్చిన నర్మద హఠాత్తుగా సిగ్గు ముంచుకొచ్చి గుమ్మంలోనే ఆగిపోయి భర్త మరోసారి పిలవడంతో తుళ్లిపడి గదిలో అడుగు పెట్టింది. అంతే... ఆమెని లోపలికి లాగి కౌగిట్లో ఉక్కిరి బిక్కిరి చేశాడు మధు తలుపు లాక్ చేసి మరీ.

ఆమెకీ ఆనందంగా వున్నా ఏదో బెరుకు! "మంచినీళ్లు" అంది, అతని కౌగిలి విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ.

"దాహం కాదు... ఏం కాదు. నీ కోసం ఓ కానుక తెచ్చాను. నవ వధువుకి తొలి కానుక" అంటూ బెడ్‌మీద పెట్టిన పాకెట్ విప్పి ఓ పట్టుచీర తీశాడతను.

ఆ చీర చూడగానే నర్మద కళ్లు తళుక్కుమన్నాయి. అది పెద్ద జరీ అంచున్న గంధం రంగుతో మిడిసిపడుతున్నట్టున్న ఖరీదైన పట్టుచీర. ఆ రంగంటే నర్మదకి చాలా ఇష్టం. చిత్రం ఏమిటంటే మధుకి ఇంకా ఇష్టం ఆ కలరంటే.

"బావుందా?" అన్నాడు, ఆమెని మంచం మీద కూర్చోబెట్టి పక్కన కూర్చుని కౌగిలిలోకి చేర్చుకుంటూ.

"చాలా బావుంది" మురిసిపోతూ అన్నది నర్మద. మొహంలో హఠాత్తుగా దిగులు చోటు చేసుకుంది.

"ఏవిటి? నీకు నచ్చలేదా?" కంగారుగా అన్నాడతను.

"ఛ! ఇది నచ్చకపోవడం ఏవిటి? కానీ నాకు మామూలు చీర కట్టుకోవడమే రాదు. పెళ్లిలో పట్టుచీరలు కట్టుకుని నానా అవస్థలూ పడ్డాను.

నా అవస్థ చూసిన అత్తయ్య ఏమన్నదో తెలుసా? "పెళ్లి తతంగం అయిపోయాక ఇంక చీరలు కట్టొద్దులే" అంటూ నవ్వారు.

"నిజమే! నువ్వు బట్టలు లేకుండా వుంటేనే మరీ బావుంటావ్" చిలిపిగా ఆమెని గుండెలకి హత్తుకుంటూ అన్నాడతను.

"ష్...! ఇంక చాలు. అవతల అత్తయ్యావాళ్లున్నారు. ఇప్పటికే చందన ఆట పట్టిస్తోంది" అంది నర్మద మరింత సిగ్గుపడిపోతూ.



అతను పకపక నవ్వేశాడు.

"నీకెందుకు? ఈ చీర ఎలా కట్టాలో నేను కట్టి చూపిస్తాను. అన్నట్టు ఇది నా తొలి కానుక. నా ఆరాధన, ప్రేమానురాగాలూ ఇందులో పొందుపరిచి మరీ ఇస్తున్నాను. దీన్నిగురించి ఎవరికీ చెప్పకు. ఇది కట్టుకుని నా కౌగిల్లోకొస్తే నీతోపాటు ఈ చీర కూడా నలిగిపోవాలి" గుసగుసగా అన్నాడు.

ఆమె మరింత సిగ్గుపడిపోయింది.

కాస్సేపు తర్వాత ఇద్దరూ కిందికొచ్చారు.

ఓసారి భాను భర్తతో కలిసి పుట్టింటికొచ్చినప్పుడు అనుకోకుండా బీరువాలోని పట్టుచీర చూసింది. "అరె! ఈ శారీ నేనెప్పుడూ చూళ్లేదే! కొత్తగా కొన్నావా? ఇంకా గడి విప్పినట్టు లేదు. అమ్మా! ఈ శారీ నేను తీసుకోనా?" అంది మరీ పసిపిల్లలా..

చందన కాస్సేపు ఏదో ఆట పట్టించడం, అనసూయ సున్నితంగా వారించడం, అందరూ కలిసి నవ్వుతూ కబుర్లు చెప్పుకోవడం జరిగింది. చీర కట్టుకుని వదిన పడే అవస్థ చూసిన చందన తల్లితో సంప్రదించి, పల్చని మెత్తని చీరలు కొనుక్కొచ్చింది. వాటిని చూసుకుని "హమ్మయ్య" అనుకుంది, నర్మద. జరీచీరలు, పట్టుచీరలూ బీరువాలోకి వెళ్లిపోయాయి. మధు ఇచ్చిన తొలి కానుక మాత్రం రహస్యపు అరలో సేద తీరుతోంది. ప్రతిరోజూ ఓసారి దాన్ని తీసి చూసుకుని మురిసిపోతూ.

"చందా వెళ్లాక కట్టుకోవాలి" అనుకుంది, నర్మద.

అదే మంచిది అనిపించింది మధుకి కూడా.

బంధువర్గం, తర్వాత చందన అత్తవారింటికి వెళ్లడం జరిగిపోయాయి. లంకంత ఇంట్లో అనసూయ, మధు దంపతులూ మిగిలారు.

అనసూయ దైవచింతనతో గడుపుతుంటే మధు దంపతులు కొత్త కాపురంలో మధురిమల్లో తేలిపోతున్నారు. ఒకే ప్రాణంగా వుంటున్నారు. భర్తని క్షణం విడిచి వుండేది కాదు నర్మద.

అతను పని చేసే బ్యాంక్ కాస్త దూరం. అతనొచ్చే టైమ్‌కి ఆమె వీధిగేటు దగ్గరే తచ్చాడుతుండేది. కాస్త ఆలస్యం అయితే కలవరపడిపోయేది. ఇదంతా గమనిస్తున్న అనసూయ-

"పిచ్చిదానా! ఇంతవరకూ వచ్చినవాడు లోపలికి రాట్టే! నువ్వెందుకలా గేటుదగ్గర పడుండడం!" అనేది నవ్వుతూనే.

నర్మద నవ్వేసేదే.. కానీ తన ప్రవర్తన మార్చుకోలేదు. చిత్రం ఏమిటంటే- ఎన్ని రోజులైనా మధు ఇచ్చిన కానుక పట్టుచీర కట్టుకోవడం మాత్రం పడలేదు.

మధు గొడవ చేస్తున్నాడు "నీకే ఇష్టం లేదేమో!" అంటూ.

ఇంక ఇలా కాదని శనివారం రాత్రి పన్నెండింటికి ఆ చీర కట్టుకుని భర్త కోరిక తీర్చాలనుకున్న నర్మద తన ప్లాను భర్తకి చెప్పింది.

అతను ఎగిరి గంతేసినంత పని చేశాడు. అనుకున్న ప్రకారం రాత్రి పదకొండు దాటాక బెడ్ రూమ్ అలంకరించారు భార్యాభర్తలిద్దరూ.

బీరువాలో నుంచి చీరని తీసి మురిపెంగా ఓసారి చూసుకుని మంచంమీద పెట్టి బాత్ రూమ్‌కేసి నడిచింది నర్మద. ఉత్సాహంగా ఏవేవో వూహించుకుంటున్న మధు ఫోన్ మోగడంతో తుళ్లిపడి తీశాడు. అది నర్మద తండ్రి చేసిన ఫోన్.

నర్మద తల్లికి సీరియస్‌గా వుందని సారాంశం. అంతే! చీర బీరువాలోకి, ఆ దంపతులు కార్లోకి వెళ్లిపోయారు. తల్లి వస్తానన్నా, ఆవిడ ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే అని తెలిసిన మధు ఆమెని ఆపేశాడు.

తర్వాత నర్మద తల్లి పోవడం, కొన్నాళ్లామె అక్కడే వుండాల్సి రావడంతో అందరి మనసులూ భారమైపోయాయి.

కొన్నాళ్ల తర్వాత మధు సినిమాకి వెళ్దామనగానే "ఏమైనాసరే ఈసారి ఆ పట్టుచీర కట్టుకోవాల్సిందే" అనుకుని దాన్ని బైటికి తీసింది నర్మద.

చిత్రంగా మధు కళ్లు తళుక్కుమన్నాయి.

కొడుక్కేదో చెప్పాలని వచ్చిన అనసూయ ఆ చీరని చూసి- "అరె! ఈ చీర చాలా బాగుందే! ఇంకా గడి విప్పలేదనుకుంటాను" అంది.

"అవునత్తయ్యా! గడి విప్పలేదు. అందుకే ఇవాళ గడి విప్పి కట్టుకుని సినిమాకెళ్దామనుకుంటున్నాను" అంది, చీర చేతిలోకి తీసుకుంటూ.

అనసూయ పెద్దగా నవ్వి "సినిమాకి ఈ పట్టుచీరా! ఛ! బావుండమ్మా. ఇలాంటివి పెళ్లిళ్లకో, పేరంటాలకో కట్టుకోవాలి. హాయిగా ఏ నైలాన్ చీరో కట్టుకో. మన మధుక్కూడా అలాంటివే ఇష్టం. ఈ చీర రేపు శ్రావణ మాసంలో కట్టుకుందువుగాని" అని ఓ సలహా పారేసి వెళ్లిపోయింది.

"వేరే ఏదైనా కట్టుకో నర్మదా!" అంటూ బైటికెళ్లిపోయాడు, మధు.

అతని కళ్లలోని నిరాశ, మాటల్లోని దిగులు గమనించిన నర్మద ప్రాణం గిలగిల్లాడిపోయింది. అయినా నిస్సహాయంగా చీరని ఆర్తిగా ఓసారి ముద్దు పెట్టుకుని బీరువాలో పెట్టేసింది.

శ్రావణం వచ్చింది. అనసూయ పెద్దల్లో కలిసిపోయింది.

ఏళ్లు గడిచిపోతున్నాయి. ఇద్దరు పిల్లలకి జన్మనిచ్చి, వాళ్లకి చదువు సంధ్యలు చెప్పించడమే కాదు.. పెళ్లిళ్లు కూడా జరిగిపోయాయి. కూతురు భాను అత్తవారింటికి వెళ్లిపోయింది. కోడలు భారతి కాపురానికొచ్చింది. కానీ ఆ చీరకి విముక్తి రాలేదు.

మధు కూడా దాన్ని గురించి అడగడం లేదు. భార్య పడే ఆవేదన చూసి చలించిపోయాడు. ఆమె తన అసమర్థతకి భర్త గుండెలో తల దాచుకుని ఏడుస్తుంటే-

"ఏవిటి నర్మదా? నువ్వా చీర గురించే ఆలోచిస్తున్నావా? అయినా నీ పిచ్చిగానీ ఆ తర్వాత కొన్నవన్నీ నేను కొన్నవేగా. అవన్నీ నా కానుకలే. అయినా మనకేమాత్రం వయసు మీరిపోయిందని. ఇంకా ఎన్నో పండుగలున్నాయి. ఈసారి నువ్వు కట్టుకోకపోయినా, నేనే కట్టి నా కౌగిట్లో నిన్ను ఉక్కిరి బిక్కిరి చేసేస్తాను" అంటూ ఆమెచేత హాయిగా నవ్వించాడు. అయినా ఆమెలో ఏదో లోటు, అసహనం. మాటలు కూడా తగ్గించేసింది.

ఓసారి భాను భర్తతో కలిసి పుట్టింటికొచ్చినప్పుడు అనుకోకుండా బీరువాలోని పట్టుచీర చూసింది.

"అరె! ఈ శారీ నేనెప్పుడూ చూళ్లేదే! కొత్తగా కొన్నావా? ఇంకా గడి విప్పినట్టు లేదు. అమ్మా! ఈ శారీ నేను తీసుకోనా?" అంది మరీ పసిపిల్లలా.

నర్మద గుండె ఝల్లుమంది. గుండెల్లో రగులుతున్న అగ్ని ఒక్కసారిగా విజృంభించింది. ఒక్కసారిగా బావురుమంటూ ఆ కానుక చీర చరిత్రంతా చెప్పేసింది.

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టులనుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

నిర్ఘాంతపోయింది భాను. తల్లిమీద జాలేసింది. తన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగి–

"నో... ఈ చీర ఇవాళే కట్టుకోవాలి ఏ ఆటంకం వచ్చినా సరే" అంటూ చీర గడి విప్పబోయింది.

అయితే నర్మద వారించి– "ప్రామిస్! రేపు సంక్రాంతికి తప్పకుండా కట్టుకుని మీ నాన్న కోరిక తీరుస్తాను. అప్పుడాయన కళ్లల్లో కాంతిని చూస్తే నాకు కొండంత తృప్తి" అంది తడి కళ్లతో నవ్వుతూ.

బాధగా నిట్టూర్చి అవతలికెళ్లిపోయింది భాను.

ఆమె మొహంలోని దిగులు గమనించిన వదిన భారతి, అన్న విక్రమ్ ఆత్రుతగా "ఏం జరిగింది?" అన్నారు, అన్నా–వదినెలు.

విషయమంతా చెప్పింది భాను.

తెల్లబోయారు అన్నా–వదినెలు.

"అయినా అమ్మకి ఇంత మొహమాట మేమిటి?" అంటూ విసుక్కున్నాడు కాస్త తేరుకున్న విక్రమ్.

ఆ సంక్రాంతికోసం అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆ భగవంతుడికి దయ తప్పిందో, లేక నర్మద ఏనాడో మహా పాపం చేసిందోగానీ ఓ అర్ధరాత్రి గుండెపోటుతో శాశ్వతంగా కన్ను మూశాడు మధు.

విషయం తెలిసిన నర్మద నిల్చున్న చోటనే కుప్పకూలిపోయింది. గొల్లుమన్నారు కుటుంబ సభ్యులు. తెల్లారేసరికి విషయం తెలిసి బంధుమిత్రులు, ఊరిజనాలూ వచ్చిపడ్డారు తీర్థప్రజలా.

నట్టింట విశాలమైన పరుపులు, దిళ్లు వేసి పడుకోపెట్టిన మధు హాయిగా నిద్ర పోతున్నట్టున్నాడు. తడికళ్లతో చూస్తున్నారే తప్ప ఎవరూ విమర్శించలేదు.

చాందిని అన్న భౌతిక కాయందగ్గర కూర్చుంది ఏడుస్తూ. నర్మద ఎవరెంత బతిమాలినా గుక్కెడు నీళ్లు తాగలేదు. బంధు మిత్రులంతా వచ్చి చూసేసరికి పొద్దు వాలిపోయింది. సూర్యాస్తమయం దాటాక కర్మకాండలు జరిపించకూడదని పురోహితులు చెప్పడం, జనాలు కన్నీటితో ఇళ్లదారి పట్టడం జరిగిపోయాయి.

నర్మద శూన్యంలోకి చూస్తూండిపో యిందేగానీ నోరు మెదపలేదు. భారంగా తెల్లవారింది. జనాలూ చేరుకున్నారు. బాధ పడుతూనే విధి నిర్వహణలో పడిపోయారు. ఆ ఇంటికి సంబంధించినవాళ్లు, తల్లి అలా రాయిలా వుండడం చూడలేని పిల్లలు, ఆమె బావురు మని ఏడిస్తే బావుండు... గుండెలు కాస్త తేలికపడతాయేమో... అనుకుంటూ కుమిలి పోతున్నారు భాను, భారతి.. రాతిబొమ్మలా కూర్చున్న నర్మద దగ్గరే కూర్చున్నారు.

ప్రాణంలో ప్రాణంగా వుండే భర్త పోవడంతో ఆమెకి మతి స్థిరం తప్పిందేమో! అని భయపడ్డారు కొందరు.

బ్రాహ్మణుల మంత్రాలతో కర్మకాండ మొదలయింది. ఇన్ని జరుగుతున్నా కన్నీరైనా పెట్టకుండా కూర్చుండి పోయిన తల్లిని చూసి తండ్రి పోయిందానికన్నా ఎక్కువ బాధ పడుతున్నారు, పిల్లలు.

"కొత్త పంచలూ అవీ సిద్ధం చేశారా?" అన్నాడొకాయన.

"చేశాం!" అన్నట్టు తల పంకించాడు, విక్రమ్.

అప్పుడే ఓ చిత్రం జరిగిపోయింది.

అంతవరకూ చలనం లేనట్టున్న నర్మద గభాల్న లేచి మేడ మెట్లకేసి పరిగెత్తింది. బిత్తరపోతూ అనుసరించారు పిల్లలు.

వాళ్లని పట్టించుకోకుండానే మేడమీది గదిలోని బీరువాలోని చీరలన్నీ లాగి పడేసి, భర్త తొలి కానుకగా ఇచ్చిన చీర తీసుకుని వచ్చినంత వేగంగా కిందికొచ్చి భర్త దగ్గర కూర్చుని అతని మొహాన్ని పట్టుకుని సున్నితంగా నొక్కుతూ–

"ఇదిగోనండీ... ఈ చీర (మీ తొలికానుక) ఇన్నాళ్లూ బీరువాలోనే వుండిపోయింది. ఇప్పుడు కట్టుకుంటాను" అని హృదయ విదారకంగా ఏడుస్తూ అతని గుండెల మీద వాలిపోయింది.

అంతవరకూ బిత్తరపోయిన జనాలు, మంత్రాలు ఆపేసి బ్రాహ్మణులు తేరుకుని–

"ముందావిణ్ని తీసికెళ్లి కాసిన్ని మంచినీళ్లు తాగించి సేదతీర్చండి" అన్నారు.

పిల్లలు ఏడుస్తూనే ఆమెని తండ్రి గుండెల మీది నించి లేవదియ్యాలని ప్రయత్నించి తెరిచివున్న ఆమె కళ్లని, ఆగిపోయిన ఆమె నాడినీ చూసి మరోసారి బావురుమన్నారు. ఆమె భర్త గుండెలమీదే ప్రాణం విడిచిందని గ్రహించిన కొందరు పెద్దలు, ఆమెని మధు పక్కనే పడుకోపెట్టారు.

రోదనలతో ఆ ప్రదేశమంతా దద్దరిల్లిపోయింది. పెద్దలు వారికి ధైర్యం చెప్తూనే కార్యక్రమాలు ప్రారంభించారు.

బైట మధుకోసం పాడె సిద్ధమయింది. అంతిమ యాత్రకి ముందు జరిగే తతంగం పూర్తయింది. క్షణాల్లో మరో పాడె తయారైంది.

కొందరు పెద్దలు సంప్రదించుకుని రెండు పాడెలనీ ఏకపాడెగా పటిష్టంగా కట్టించారు. ఆ దంపతుల భౌతిక కాయాలు దానిమీదికి చేరిపోయాయి. కన్నీటితో వేసిన పూలదండలతో పూల శకటంలా వుందా పాడె.

పొంగుతున్న దుఃఖానికి ఆనకట్ట వేస్తూ ఓ పక్కగా వున్న పట్టుచీరని తెచ్చి తల్లితండ్రుల మీద గడి విప్పకుండానే పైటకొంగు మాత్రం కనిపించేలా కప్పారు కన్నబిడ్డలు. ఆ చీర గడి తల్లే విప్పాలనీ, అది కట్టుకున్న భార్యని చూసి తండ్రి పొంగిపోవాలనీ ఆ బిడ్డల ఆశ. నమ్మకం కూడా.

పూలతేరులా కదిలిందా పుణ్యదంపతుల వాహనం.

సూర్యకిరణాలు ఆ జరీ పైటకొంగుమీద పడి "మరు జన్మలో మీ కోరిక తప్పక తీరుతుంది" అని సూర్యభగవానుడు ఆశీర్వదిస్తున్నట్టుంది. ■



సభ్యత

వ్యక్తిత్వ వికాసమిచ్చే
సౌందర్య జీవనశైలి సభ్యత
సామాజిక చైతన్య స్వేచ్ఛావారధి.

సభ్యత మధుర ఫలాల మహావృక్షం
విశ్వమానవాళి
సేద తీర్చే విశాల హృదయం
సభ్యత జీవన పయనంలో

ముందుకు నడిపే రాస్తాగా
మలుపు తిప్పే చౌరస్తాగా
నింగికి నిచ్చెనేసి
లక్ష్య శిఖరం చేరుస్తుంది.

సభ్యత నిరంతర చైతన్య జీవవాహిని
ఉద్రేకం ఉన్మాదాల మురికి కడిగి
మానవత్వ రథసారథికి
హారతి పడుతుంది.

నీ కలం దేహంలోంచి
రాలిపడిన నెత్తుటి చుక్క
అమ్మ నుదుటి సింధూరమై
మాతృ స్పర్శకు పులకిస్తే
నా సమూహంలో
సభ్యత్వ స్వరూపం
సాక్షాత్కరించినట్టే.

నా కొడుకు నన్ను.. నేను నాన్నను
ఆత్మీయంగా ఆదరిస్తే
నాన్న.. నాన్న నాన్నకు
ఆప్యాయత పరిమళాలనద్దితే
నా వంశ క్షేత్రంలో
సంస్కార బీజాలు మొలకెత్తినట్టే.

నలుగురిలో
నమస్కార సంస్కారం చిగురిస్తే
నా సమాజంలో
సభ్యత విరులు వికసించినట్టే.

– నాశబోయిన నరసింహ

తెల్లవారిన వెలుగు

పక్షుల అలికిడితో
యాంత్రిక లోకం
మేలుకొంటుంది

నలిగిన జీవన పోరాటాల
స్వప్నం ఓ గూటికి
చేరకుండానే

కొండపల్లి
బొమ్మలా
మన చూపు
సిన్సియర్‌గా
బతుకు వనంలోకి
ఓ అడుగు వేస్తుంది.

కాగితంపూలు నవ్వుతో
మన కలల వనంచుట్టూ
చీకటి నీడల విన్యాసం

నింపాదిగ కాచుకు
కూచుంటుంది ఎప్పుడు
తెల్లవారినా ఈ లోకం
మన చుట్టే నటిస్తుంది
వికల స్వప్నాల గూటిలోకి
మన కాలాన్ని నెట్టివేస్తుంది
ముంగిపు లేని ఈ చీకటి

అలల్ని
ఎన్ని
మార్లు
ఛేదించినా

సుదూర తీరాల స్వప్నాన్ని
చేరువలోకి రానీయదు.
తెల్లవారిన వెలుగు
ఈ గూటిలోకి చేరనీయదు.

– రవీంద్ర

మౌనఛాయ

ఆమె నిన్న వెళ్లిపోయింది
కొన్ని కలయికలు మరణించాక
మనుషులందరూ విడిపోవాలని
అర్థమైంది
పాదముద్రల గుర్తులు నేలమీద
పడనివ్వకుండా
ఆత్మ చిటికెన వేలు పట్టుకుని
స్వప్నపు అంచుల్ని
చెదరనీయకుండా
ఆ వర్షపు రాత్రిలో...
తను వెళ్లాక
ఏదో ప్రాణపుష్పం తెగిపడిన బాధ

ఆశని ఎందుకనో అర్ధాంతరంగా
తెంపుకోవడానికి సాహసించక
కూలిపోయిన దేహాన్ని మరలా...
మరలా

నిర్మించుకునే శక్తి లేక
నిదానంగా కొన్ని మౌనఛాయల్ని
గుండెమీద పరచుకున్నాను.

పెదవుల అంచుమీది నవ్వు
చెరసాలని చేరి రాలిపోయింది
ఆవిడని అర్థం చేస్కోక మునుపే
ఎందుకనో చేజారిపోయింది.

మిగిలి ముక్కలయిన
సాయంత్రాల్ని ఏరి
నది గొంతులోకి ఒదులుతున్నాను.

ఇంక ముగించుకుందామా!
కళ్లలో మిగిలిన మేఘాల్ని వర్షించి
నిద్ర సముద్రపు వాకిట ముందు
నిల్చి
శబ్దం సృష్టించని రాగంతో
దేహాన్ని వేలాడదీసి
ఒకరికొకరం దగ్గరయిపోదాం!

– ఖాదర్ షరీఫ్

భూమాత రోదన

మానవుడు దురాశపరుడు
ఉచితంగా వస్తే దేన్నీ వదలడు
పంచభూతాలపైనే
పెత్తనం చెలాయిస్తున్నాడు
భూమాతను ముక్కలు చేస్తున్నాడు
పాతాళానికి పైపులేసి
అందినకాడికి నీటిని తోడేస్తున్నాడు
భూమాత నిత్యం కుమిలిపోతూ...
బాధను మౌనంగా భరిస్తోంది.
మనుషుల మూర్ఖత్వానికి
నిలువెల్లా కాలిపోతోంది
నిత్యం రోదిస్తూ...

– కాయల నాగేంద్ర

సింగిల్ పేజీ కథ

మనిషి అనే కావ్యం

– కంచనపల్లి వేంకట కృష్ణారావు

ఆ పావురం గుడిమీద వాలింది. మంత్రోచ్చారణ వింది.

మసీదుకు ఉన్న గూట్లో కూర్చుంది. "అల్లాహో అక్బర్..." వింది.

అటూ ఇటూ తిరిగి చర్చీ మీద కూర్చుంది. "నా ప్రభువు" అంటూ క్రీస్తు కీర్తనలు వింది.

మైదానం పక్కనున్న గోడ మీద కూర్చుంది. రాజకీయ నాయకుడి అనర్గళ ఉపన్యాసం వింది. వేరే పార్టీమీద, వేరే వ్యక్తుల మీద ఉపన్యాసకుడు కక్కే విష ఉపన్యాసం వింది. కొద్ది రోజుల తరువాత దూరంగా గోడమీద కూర్చుంది. ఓ చిన్న గుంపు మరో చిన్న గుంపు కర్రలతో కొట్టుకోవడం చూసింది!

మనుషుల్లో విద్వేషం, మాటల్లో విషం, చేతల్లో క్రూరత్వం చూసింది! చూసినా ఏం చేయగలదు? మూగగా మనసులో అనుకొంది– "ఈ లోకం ఇంతేనా?" మంచిని బలవంతంగా తోసుకువెళుతున్న చెడ్డను చూచి ఆశ్చర్యపోతోంది.

కాలం గిర్రున తిరుగుతోంది. కాలచక్రం నిబంధనలు తప్పవు. పావురం ఆయుష్షు పడిపోయింది. ఒకరోజు తను కూర్చున్న చెట్టుమీద నుండి పడిపోయింది. అలానే దాని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది. చెట్టుమీదున్న పువ్వు కొమ్మనుండి ఊడి దిగులుగా పావురం మీద పడింది.

* * *

పావురం ఆత్మ దేవుడి దగ్గరకు వెళ్లిపోయింది. దేవుడు దాని ఆత్మను సుతారంగా నిమిరాడు.

"నీవు అన్ని మతాల స్తోత్రాలు విన్నావు. అందుకే పుణ్యం చేసుకుని నా దగ్గరకు వచ్చావు" చెప్పాడు, దేవుడు వెలుగులు చిమ్మే మొహంతో.

పావురం ఆత్మ దేవుడికి దండం పెట్టింది.

"నీకు ఉత్తమమైన మనిషి జన్మ ఇస్తాను... మంచి పనులు చెయ్యి. మనిషి జన్మ తరువాత నా దగ్గర ఉండిపో" దేవుడు చెప్పాడు.

"దేవా! మీకు అనేక నమస్కృతులు. మీరు చెప్పినట్లు మనిషి జన్మ ఇవ్వండి. కానీ నా మనసులో జాతి, మతం, కుల భావాలు తీసెయ్యండి. నేను చూసిన మనుషుల్లో గల కుళ్లు, కార్పణ్యం నాలో లేకుండా చూడండి. తోటి మనిషిని ప్రేమించే మనసివ్వండి. అది చాలు నా మనిషి జన్మకు" ఎంతో ఆర్ద్రతతో చెప్పింది పావురం ఆత్మ.

పావురం ఆత్మ మాటలు విని దేవుడు ఆశ్చర్యపోయాడు. లోకంలో జరిగే కుళ్లును పావురం బాగా గమనించి, తన మరో జన్మ వేరే విధంగా ఉండాలని కోరుకున్న పావురం నిర్ణయం భగవంతుణ్ణే కాదు, ఆయన చుట్టూ ఉండే దేవతలను సైతం ఆశ్చర్యపరిచింది.

పావురం ఆత్మ కోరినట్టే– దానికి మంచి మనిషి జన్మ ఇవ్వాలని దేవుడు తలచాడు.

"దేవా! ఆ పావురానికి మనిషిజన్మ ఇవ్వు, కులాల, మతాల చిచ్చు, పగ, ప్రతీకారం, దుర్గుణాలు లేకుండా శాంతిని వ్యాపింపచేసే మనిషిగా పుట్టించు. 'మనిషి' అంటే ఒక పదం కాదు. 'మనిషి' అనే పదం ఒక మహా కావ్యంగా పరిఢవిల్లాలి. మనిషిగా పుట్టిన పావురం కీర్తి నిలిచిపోవాలి" అని అక్కడే ఉన్న నారదుడు రెండు చేతులు జోడించి ఆ దేవుణ్ణి కోరుకున్నాడు.

"తథాస్తు" అని దేవుడు పావురం ఆత్మను ఆశీర్వదించాడు.

"పావురం ఆలోచన, మంచితనం నన్ను ముగ్ధుణ్ణి చేసింది! ఈ పావురం మనిషిజన్మ ఎత్తి, మంచి మనిషిగా తోటి ప్రజలు అతనిని కీర్తిస్తారు!

భూమిమీద పావురాలు శాంతికి చిహ్నాంగా ఉండే విధంగా వరం ఇస్తున్నాను" అన్నాడు, దేవుడు.

"ధన్యోస్మి దేవా...!" అంటూ పావురం ఆత్మ తన పావురం జన్మలో విన్న మంత్రాలు, స్తోత్రాలతో స్తుతించింది.

దేవుడు ఆనందంతో పావురానికి భూమి మీద ఉత్తమ మనుష్య జన్మ కలిగించాడు.

పావురం శాంతికి చిహ్నాంగా నిలబడిపోయింది! ■





వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ

డా|| దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3

సెల్స్: 9885446501/ 9885449458

బుద్బుద వేధ అంటే ఏమిటి?

బుద్బుదము అనగా నీటి బుడగ అని అర్థం. భూమి లోపలినుండి భూమి పైభాగానికి నీరు/ నీటి బుడగలు తమంత తామే వస్తున్నట్లయితే 'బుద్బుదము' అనవచ్చు.

ఒక గృహంలో, గృహావరణలో కానీ ఈ విధంగా నీరు భూమిలోపలి నుండి తమంతట తామే పైకి వస్తున్నట్లయితే ఆ గృహం 'బుద్బుద వేధ' అనే వాస్త దోషాన్ని కలిగి వుంటుంది. గృహానికి 'బుద్బుద వేధ' వుండ కూడదు.

అలాగే 'బుద్బుద వేధ' దోషం కలిగివున్న క్షేత్రంలో గృహ నిర్మాణం గావింపకూడదు. స్థలం నైసర్గికం అనుసరించి బాగున్నప్పటికీ స్థలం స్వభావ రీత్యా ప్రతికూల ఫలితాలు కలుగజేస్తుంది. అనేక విధాల హీన స్థితికి చేరుకోవలసి వస్తుంది. ముఖ్యంగా కుటుంబ నాశనం, పశుక్షయం మొదల యిన దుష్ఫలితాలు కలుగుటయే గాక ఇల్లు పరుల వశమయ్యే అవకాశం కూడా ఉంది. బావులలో కొంత లోతువరకు వచ్చే నీటి ఊటకు, బుద్బుదమునకు చాలా వ్యత్యాసమున్నది. గృహావరణలో వాస్తు నియమాలకు అనుగుణంగా బావి వుండటం దోషం కాదు. కానీ గృహావరణలో బుద్బుదములు ఎక్కడ వున్నా దోషమే. చాలా వరకు వీటిని నిర్మూలించటం లేదా తరలించటం కష్టసాధ్యమవుతుంది. అది కూడా సాధ్యం కానప్పుడు ఆ స్థలాలను విసర్జించటమే మేలు.

వర్షపునీరు ఎటువైపు వెళ్లాలి?

మల్లారెడ్డి - కర్నూలు

ప్రశ్న: 1) మా గ్రామంలోని స్థలాలన్నీ దక్షిణ ఆగ్నేయం పెరిగాయి. మాది నైరుతి బ్లాకు. పై ఇంటి దక్షిణ ఆగ్నేయం పెరిగిన స్థలాన్ని మూలమట్టానికి సరి చేస్తే ఎదురుగా (తూర్పున) వున్న స్థలానికి పశ్చిమ నైరుతి వీధిపోటు అవుతుందా?

2) నైరుతి బ్లాకు గృహంలో వర్షపు నీరు, వాడుకనీరుగానీ ఈశాన్యం మూలకు చేరిన పిదప, ఆ నీరు ఏ వైపు నుండి బయటకు వెళ్లాలి?

జవాబు: 1) తప్పకుండా తూర్పున వున్న స్థలానికి. పశ్చిమ నైరుతి వీధిపోటు అవుతుంది.

2) వీధిలో దక్షిణం వైపుకు డ్రైనేజీ నీటి లైనుంటే, ఈశాన్యం నుండి అండర్ గ్రౌండ్ పైప్ లైన్ గుండా దక్షిణ ఆగ్నేయం మూల నుండి నీటిని బయటకు పంపించవచ్చు. అలాగే వీధిలో పడమర వైపు డ్రైనేజీ పైపు లైన్ వుంటే ఈశాన్యం నుండి పశ్చిమ వాయువ్యంగా అండర్ గ్రౌండ్ పైపు లైనుతో నీటిని బయటకు పంపించవచ్చు.

పూజ చేసే సమయంలో ఎటువైపు కూర్చోవాలి?

సుబ్రహ్మణ్యం - రాజోలు

ప్రశ్న: బాత్‌రూమ్, లెట్రిన్ ఈశాన్యానికి, ఆగ్నేయానికి మధ్య వున్నది. దానిలో (కమోడ్) దక్షిణ ముఖంగా వున్నది. అలా వుండవచ్చా?

వంటగది ఈశాన్యానికి, ఆగ్నేయానికి మధ్య వున్నది. ఆ గదిలోనే పూజా మందిరం వున్నది. అది తూర్పు, పడమర మధ్య వున్నది. దేవుని పటాలు దక్షిణ ముఖంగా వున్నాయి. పూజ చేయటానికి ఉత్తర ముఖంగా కూర్చుని చేయాలి. ఆ విధంగా చేయవచ్చా?

జవాబు: ఈశాన్యానికి-ఆగ్నేయానికి మధ్య అంటే తూర్పున లెట్రిన్, బాత్ రూమ్‌లున్నాయనుకోవచ్చు. తూర్పున బాత్‌రూమ్ (నీళ్ల గది) వుండవచ్చు గాని లెట్రిన్‌గది వుండకూడదు. వంటగది తూర్పు దిక్కుకంటే ఆగ్నేయ మూలన వుండటమే శ్రేష్ఠం. ఇంటికి దక్షిణ గోడకు ఆనుకొని పూజగది వుండకూడదు.

సాధారణంగా టాయిలెట్స్, స్టోర్ రూములు, పడక గదులు అక్కడుండవచ్చు. తూర్పున పూజ గది వుండాలి. మీరు తూర్పున ఉన్న లెట్రిన్‌ని ప్రస్తుతం పూజగది వున్న దక్షిణం చోటుకు మార్చుకుని, పూజ గదిని ప్రస్తుతం లెట్రిన్ వున్న (తూర్పు దిక్కుకు) మార్చుకుంటే రెండు దోషాలు పోతాయి కదా! ఇంట్లో ఉత్తర దక్షిణాభిముఖంగా పూజలు చేయకూడదు. తూర్పుకు అభిముఖంగా లేదా పశ్చిమాభిముఖంగా మాత్రమే పూజలు చేస్తే మంచిది.

ఆగ్నేయంలో సెప్టిక్ ట్యాంకు ఉండవచ్చా?

రమణమూర్తి - హన్మకొండ

ప్రశ్న: 'వర్గు సంబంధాలు' రాసిన ప్రకారమే సింహద్వారాలు వచ్చేటట్లు ప్లాట్లు కొనుక్కోవచ్చా? ఎక్కువ మంది తూర్పు వైపుకు రోడ్డు వున్న ప్లాట్లు కావాలని కోరుకుంటారు. అది తప్పా? జాతకం లేకుంటే వ్యవహార నామం సరిపోతుందా? పశ్చిమ సింహద్వారం గల నేను ఆగ్నేయంలో 'సెప్టిక్ ట్యాంక్' కోడిగుడ్డు ఆకారంలో నిర్మించాను. ఆ ఆకారం సరైందేనా?

జవాబు: వర్గు ప్రకారం సింహద్వారం వచ్చే విధంగా ప్లాటు కొని, ఇల్లు కట్టుకోవచ్చు. అయితే ముందే పథకం ప్రకారం స్థలం కొనుక్కుంటే సులభతరమవుతుంది. తూర్పు వీధి వున్న స్థలంలో ఎవరైనా వాస్తు ప్రకారం గృహ నిర్మాణం గావించుకోవచ్చు. వాస్తు బాగున్న ఇంట్లో ఎవరున్నా ఫలితాలు బాగుంటాయి. వర్గు కూడా కలిస్తే ఇల్లు మరింత కలిసొస్తుంది. వాస్తు విషయంలో జాతకం కంటే వ్యవహార నామమే ముఖ్యం. లగ్నాలకు, ముహూ ర్తాలకయితే జాతకం లేదా జన్మ నామం ముఖ్యం. ముఖ ద్వారం ఏదయినా, సెప్టిక్ ట్యాంక్‌ని 'కోడిగుడ్డు' ఆకారంలో నిర్మిం చడం దోషం కాదు. కానీ ఆగ్నేయ మూలలో నిర్మించటం వాస్తుదోషం. ఇలాంటి దోషం వల్ల ధన వృధా అవుతుంది. మనస్తాపం కలిగించే సంఘటనలు జరుగుతాయి. ఇతర వాస్తు గుణాలనుబట్టి ఫలితాల సాంద్రత వుంటుంది. ■

వాస్తువిద్వాన్ డా|| దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: --

పుట్టినతేదీ:------------------- ఊరు: --------------

జన్మనక్షత్రం:---------తల్లిపేరు:---------------------

చిరునామా: --------------------------------------

------------------ ఫోన్: ----------------------

పర్సనల్ పాయింట్

చల్లా సుబ్రహ్మణ్యం
1 సి-ఐక్యూ టవర్స్, 3-4-540,
నారాయణగూడ, హైదరాబాద్-27
మొబైల్: 9866362224/ 9553662224
challascounsel@gmail.com
www.challascounsel.com

మా అమ్మాయి అసలు నవ్వదు...

ఎస్.ఎస్ - ఆదిలాబాద్

ప్రశ్న: మా అమ్మాయి వయసు 17.ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. చదువు విషయంలో తనతో మాకెలాంటి సమస్యలు లేవు. తనకి సహనం, ఓర్పు కూడా చాలా ఎక్కువ. నోరు తెరిచి ఒక మాట మాట్లాడదు. కానీ అవసరమైనప్పుడు మాట్లాడాలి.. అని మేం ఎంత చెప్పినా తనకు అర్థంకాదు. ఎప్పుడూ సీరియస్‌గా వుంటుంది. అసలు నవ్వదు. ఎవరితోనూ మాట్లాడదు, కనీసం పలకరించదు. స్నేహితులు కూడా చాలా తక్కువ. నోరు తెరిచి ఇది కావాలి... అని అడగదు. మేం ఎక్కడికైనా వెళదామంటే, రమ్మంటే వస్తుంది. వద్దంటే ఊరుకుంటుంది. తనకి డ్రెసెస్ కొనాలన్నా నేనే సెలెక్ట్ చేయాలి. సినిమాలు, షాపింగ్, ఆటలు లాంటి సరదాలు లేవు. చాలా నెమ్మదస్తురాలు. ఎవరినీ బాధ పెట్టే గుణం లేదు. మా అమ్మాయి అందరిలా లేదేమో, తనలో ఏదైనా లోపం వుందేమోనని ఒక్కోసారి అనిపిస్తుంటుంది. ప్రాణయోగ కౌన్సెలింగ్ ద్వారా ఆ లోపం తెలుసుకుని దిద్దుకోవచ్చా?

జవాబు: మీ అమ్మాయిలో 'లోపం' వుందేమో కాదమ్మా! గ్యారంటీగా లోపం వుంది. ఏదైనా జోక్ వేస్తే నవ్వలేదు అంటే డౌట్ లేకుండా అది లోపమే! పసిపిల్లవాడు ఏడవడం లేదు అంటే లోపమే...! అంటే ప్రకృతికి విరుద్ధంగా వుండే ప్రవర్తన లోపం కిందే లెక్క. తనకంటూ ఇష్టాయిష్టాలు (likes & dislikes), తన ప్రవర్తనా (behaviour), మనస్తత్వం (personality), తనకేం చేస్తే సంతోషం కలుగుతుంది, నలుగురితో పంచుకునే తత్త్వం- ఇలా ఒక ఇండిపెండెంట్ (independent) వ్యక్తిగా తయారు కావాల్సిన అవసరం ఉంది. 'ప్రాణయోగ కౌన్సెలింగ్' ద్వారా ఆ లోపాలకు కారణాలు తెలుసుకుని వాటిని దిద్దే ప్రయత్నం చేద్దాం. పాపను తీసుకుని రండి.

నా ఆలోచనలే నాకు అడ్డంకి...

పి.బి - విజయవాడ

ప్రశ్న: నా వయసు 25. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. నేను ప్రేమించిన వ్యక్తి కూడా సాఫ్ట్‌వేర్ మనిషే. మా ఇద్దరికి రెండున్నరేళ్ల పరిచయం. సంవత్సరం నుంచి ప్రేమ. మొదట తనే ప్రపోజ్ (propose) చేశాడు. నాకు అతనిమీద ఏలాంటి దురభిప్రాయం లేదు. కొంచెం టైం తీసుకుని ఓకే చెప్పాను. మా ఇంట్లో వాళ్లని ఒప్పించి పెళ్లి చేసుకుందామనుకున్నాం. మొదట్లో అభ్యంతరం చెప్పినా పెద్దవాళ్లు కూడా ఒప్పుకున్నారు. మరో మూడు నెలల్లో మా పెళ్లి. నాకేంటో భయంగా వుంది. మా పరిచయం రెండున్నరేళ్లు అయినా మేం పర్సనల్‌గా కలిసి గడిపిన సందర్భాలు చాలా తక్కువ. తను ఢిల్లీలో పని చేస్తాడు. మా పెళ్లికి ఏ విధమైన అడ్డంకులు లేవు. ఉన్న ఒకే ఒక అడ్డంకి (hurdle) నా ఆలోచనలు. చిన్న విషయాలను అతిగా ఆలోచించి, తనను నేను బాగా అర్థం చేసుకున్నాను అనే నమ్మకంలో ఇంత కాలం వున్నాను. అతని ఆలోచనా విధానం, భార్యగా నా గురించి అతని అభిప్రాయం లాంటి విషయాల్లో అతన్ని ఏమాత్రం అర్థం చేసుకోలేకపోయాను అని ఇప్పుడు అనిపిస్తోంది. మరో మూడు నెలల్లో పెళ్లి. పెళ్లి ఆగిపోతే పరువు సమస్య. మరో వైపు నా జీవితం. నేను తనని, తన మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో విఫలం (fail) అయ్యాను అనే భావన నన్ను కుంగదీస్తోంది. నేనేం చేయాలి?

జవాబు: పరిస్థితులు ఎలా వున్నా వచ్చిన సమస్యను ఎదుర్కోవడమే జీవితం. ఇన్నేళ్ల స్నేహం, ప్రేమలో అతన్ని ఎందుకు అర్థం చేసుకోలేకపోయాను? అని ఆలోచించడం మానేసి ఈ మూడు నెలల్లో-

1. తనని ఎలా అర్థం చేసుకోవాలి?
2. అవసరమైతే తనని నీకు అనుగుణంగా ఎలా మార్చుకోవాలి?
3. నీ ఆలోచనా విధానం (thought process)లో ఎలాంటి మార్పులు అవసరం?

అనే విషయాలు ఆలోచించు. క్షణం వృథా చేసుకోకు. కాబోయే భార్యా భర్తల మధ్య అవగాహన కోసం ఉద్దేశించబడిన ప్రీ-మేరిటల్ కౌన్సెలింగ్ (Pre marital counsellig) అవకాశం ఇద్దరూ లేదా కనీసం నువ్వు ఒక్కదానివైనా తీసుకో. ధైర్యంగా పెళ్లి చేసుకోగలుగుతావు.

గుడ్ లక్!

తల్లా-పెళ్లామా?

ఎల్.ఆర్.ఎస్ - వైజాగ్

ప్రశ్న: నా వయసు 33. పెళ్లై నాలుగు సంవత్సరాలు కావస్తోంది. అమ్మా-నాన్నలకి నేను ఒక్కణ్ణే కొడుకుని. ఇంట్లో ఉండేది నేను, నా భార్య, మా రెండేళ్ల పాప, అమ్మ, నాన్న. మా నాన్నగారికి ఆరోగ్యం బాగుండదు. దాంతో కుటుంబ బాధ్యత అంతా నాపై పడింది. నేను చిన్నప్పటినుంచి అమ్మకు బాగా దగ్గర. నిజం చెప్పాలంటే నాన్నని, నన్ను అమ్మనే చూసుకుంది. చాలా కష్టపడి నన్ను చదివించింది. నాకు కాబోయే భార్య నన్ను, నా కుటుంబ పరిస్థితుల్ని అర్థం చేసుకోగలిగే అమ్మాయి కోసం వెతికి వెతికి పెళ్లి చేసుకున్నాను. నా భార్య చాలా మంచిది. మా ఇద్దరికి ఎలాంటి గొడవల్లేవు. కానీ అమ్మకి-నా భార్యకి మధ్య వస్తున్న చిన్న చిన్న గొడవలు చిలికి చిలికి గాలివానలా తయారవుతున్నాయి. ఎవరి ధోరణి వారిది. నేను ఆఫీస్ నుంచి తిరిగొచ్చేలోపు ఏదో గొడవ రెడీగా ఉంటుంది. ఇద్దరికీ నచ్చజెప్పడానికి నేను ఎంతో ప్రయత్నించాను. అయినా ఏమి ఉపయోగం లేదు. ఇద్దరిలో ఎవరిని సపోర్ట్ చేయాలో అర్థం కావడం లేదు. వాళ్ల దోవన వాళ్లని వదిలేద్దామంటే ఇద్దరు కూడా నన్ను విషయాల్లోకి లాగుతున్నారు. ఎటు మాట్లాడినా కష్టంగానే ఉంది. అమ్మా-నాన్నలకి దూరంగా వెళ్లి కాపురం పెట్టడం ఒక్కటే మార్గంలా తోస్తోంది. నేనేం చేయాలి?

జవాబు: నాయనా... నీదేమి అసాధారణమైన సమస్య కాదు. నువ్వు, నీ భార్య, విడిగా వెళ్లిపోయి కాపురం పెట్టడం ఒక పరిష్కారం నిజమే! కానీ మీ అమ్మా-నాన్నలకి నువ్వు ఒక్కడివే కొడుకువి. వాళ్ల మాత్రం నీకు దూరంగా ఎలా వుండాలి? వాళ్లని వదిలి వెళ్లినా నువ్వు మనశ్శాంతిగా వుండలేవు. సో... అది తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వతమైనది కాదు. తల్లా- పెళ్లామా ఇద్దరిలో ఎవరు ముఖ్యం అంటే ఇద్దరూ ముఖ్యమే అని నా అభిప్రాయం. ఇద్దరినీ నువ్వు నీ విజ్ఞతతో, తెలివితేటలతో ఎంత సంయమనం (balance)తో మేనేజ్ చేస్తావు అన్నది నీ శక్తి, సామర్థ్యాలకు సంబంధించిన విషయం. ఈ బ్యాలెన్స్ చేయడం ఎలా? అనేది ప్రాణయోగ కౌన్సెలింగ్ ద్వారా నేర్చుకుని ప్రాక్టీస్ చెయ్యి. గుడ్ లక్.

పద మథనం-122

- నిర్వహణ: వాడ్రేవు ఉమాశంకర్



ఆధారం

అడ్డం

1. లియోనార్డో డావిన్సీ చిత్రించిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వర్ణచిత్రం-4
4. మన పూర్వీకుల నుంచి అనుసరణగా, ఆచరణగా వస్తున్న అలవాటు-5
7. ఏనుగు-2
8. ప్రతివాడికి వీడు చుక్కెదురు-2
9. అమెరికా జలపాతం-4
10. మారిన పోలీసు మధ్యలో లాఠీ వదిలేసాడు-2
12. అద్దె, కిరాయి-3
13. పెద్ద ధనవంతుడుగా మహేష్‌బాబుతో నిర్మించిన చిత్రం-4
15. అనేక నదుల కలయిక-4
17. వస్తావా.. లేదా? అని రెండు ముక్కల్లో అడగండి-2
18. ఓడిపోయి కప్పం చెల్లించే పొరుగుదేశపు ఏలిక-5
20. అలనాటి స్వాతంత్రోద్యమ నినాదం-5
25. వేంకటేశ్వరస్వామిని చేరదీసిన తల్లి-3
26. ప్రజ్ఞని మెచ్చి ఇచ్చే ధనం-5
